POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
నవంబరు 2022
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 40 సంచిక: 07




20TH SEPTEMBER, 2022

# సాయినాథుడు నిత్య యాత్ర చేసిన లెండీ వనం

*'సాయిబాబా'*

శిరిడి దర్శించిన భక్తులు సాయికి ప్రధాన నివాసస్థలాలయిన గురుస్థానము, సమాధి మందిరము, ద్వారకామాయి, చావడిలతోపాటు సాయి నిత్యము వేంచేసిన లెండి తోటను, అందులో ఆయన స్థాపించిన నంద దీపానికి, వారు సంరక్షించి పెంచిన మూడు వృక్షాలకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి, వారికి నీరు యిచ్చిన బావిని సందర్శిస్తారు. నందదీపానికి తూర్పుగా ఔదుంబరము (మేడి చెట్టు లేక అత్తిచెట్టు), పడమరగా ఒక మందిరము, తూర్పున ఒక చిన్న మందిరము వున్నాయి. వాటికి ఈశాన్యంగా ఒక రాతిమీద పాదుకలు ప్రతిష్ఠించి వుంటాయి. ఆ కట్టడం అమ్మీదాస్ భవాని మెహతా అనే బాబా భక్తుని సమాధి. దాని పక్కనే నేలబారుగా ఒక బండ, దాని మీదుగా పాదుకా చిహ్నాలు వుంటాయి. అది ముక్తారాం అనే సాయిభక్తుని సమాధి. వీరిద్దరి గురించి క్లుప్తంగా తెలుసుకుందాము.

అమీనా భవానీ మెహతా బొంబాయిలోని ఒక బ్రిటిష్ ఫోటోగ్రాఫ్ కంపెనీలో పనిచేస్తూ వుండేవాడు. కొన్నిసార్లు యాదృచ్ఛికంగా మాత్రమే శిరిడి దర్శించి, బాబా మహిమను చవిచూశాక, బాబా భక్తుడయ్యాడు. అంతేకాదు ఎంతోమందిని దర్శనానికి శిరిడి తీసుకువచ్చేవాడు. తర్వాత ఈయనే గుజరాత్ లో ప్రప్రథమంగా సాయిబాబా గురించి చిన్న పుస్తకం ప్రచురించారు. అతడి భక్తికి బాబా సంతృప్తులు అయ్యారు కాబోలు, అతని సమాధికి తమకు ప్రీతి పాత్రమైన లెండిలో శాశ్వతంగా స్థానం కల్పించారు.

ముక్తారాము హాండేశ్ వాస్తవ్యుడు. తరచూ శిరిడీ వస్తూ వుండేవాడు. తర్వాత సంసారాన్ని త్యజించి బాబా వలె కఫ్నీ ధరించి సాధుజీవితాన్ని గడిపాడు. కానీ ఏ కారణంగానైనా బాబాను అనుకరింప చూడటం అపచారమేకాక ఎంతో ప్రమాదకరమైనది. సాయి మహాసమాధి చెందిన తర్వాత కొంతకాలానికి అతడు ఒక రోజున ద్వారకామాయిలో ప్రవేశించి వెనుక సాయి కూర్చున్న ఆసనంపై కూర్చున్నాడు. అమాయకులైన ప్రజలు సాయి అతనిని తమ గద్దెకు అంటే తమ సద్గురుపీఠానికి వారసుడిగా ఎన్నుకున్నారని తలచి అతని పాదాలపై పడటం ప్రారంభించారు. తర్వాత అతడు పశ్చాత్తాపం చెంది తానొక రుగ్మతతో చిరకాలం బాధ పడుతున్నానని, అది గద్దెపై కూర్చుంటే తగ్గగలదన్న ఆశతో కూర్చున్నానని స్పష్టం చేశాడు. అతడు తర్వాత శిరిడీలోనే నివసించి అక్కడే మరణించాడు.

ఇలానే సాయి మహాసమాధి చెందిన తర్వాత ఆయనను చిరకాలం భక్తిశ్రద్ధలతో సేవించి ఫకీరు జీవితాన్ని గడిపిన అబ్దుల్ బాబాను భక్తులు దర్శించి నమస్కరిస్తూ వుండేవారు. అందరూ అలా చేస్తుంటే తనకు నిజంగానే దివ్యశక్తి కలిగిందని అనుకోకుండా వుండటం చాలా కష్టం. అది సద్భక్తునికి కఠోరమైన పరీక్ష.

**మిగతా 11వ పేజీలో**

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:40 నవంబరు-2022 సంచిక:07

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | సాయినాథుడు నిత్య యాత్ర చేసిన లెండీ వనం | 'సాయిబాబా' | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | అభయప్రదాత | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి రమాదేవి | 10 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 12 |
| 06. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 15 |
| 07. | "ధర్మో రక్షతి రక్షితః" | శ్రీ పి. సుధాకర రెడ్డి | 18 |
| 08. | సపత్నేకర్ | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 21 |
| 09. | మహాయోగి శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రి గారు | శ్రీమతి శ్రీదేవి | 23 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి అన్నపూర్ణ | 26 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ సాయికుమార్ | 28 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |


**సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.**

# పరిప్రశ్న

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

**ప్రశ్న:- దేవతలు మనో కల్పితములా, నిజంగా వున్నారా? పరబ్రహ్మ సద్గురువుగానూ, అవతారముగానూ తప్ప -మానవాకృతి గానే తప్ప- దేవతలుగా ఉండడా?**

**- శ్రీ యం. వి. రెడ్డి, తణుకు**

**జవాబు** :-పరబ్రహ్మ సద్గురువుగా తప్ప అవతరించడు. అవతార కార్యాన్ననుసరించి తగురీతిన తన మాయకు కట్టుబడి అవతరిస్తాడు. కృష్ణుడు దైవమే అయినా కౌరవులు దుష్టులన్న భావంతోనే అవతరిస్తాడు. అన్నీ తానన్నది తన అంతరంగంలోనే యుంటుంది, అదీ ఒకానొక యెగస్థితిలో. అందుకే ఉత్తరగీతలో అర్జునుడు తనకు చెప్పిన భగవద్గీత మరచానని, మరలా చెప్పమని కోరితే "అది యోగస్థితిలో చెప్పాను, యిప్పుడు మరలా చెప్ప వీలుకాదు" అంటాడు. సద్గురువుకు పరిమితమైన అవతార కార్యముండదు. సదా పరబ్రహ్మమెలా ఉంటుందో అలానే ఉంటాడు. అన్నీ తానే అయిన స్థితిలో ఉంటాడు. అందుకే వారికి ప్రత్యేకమైన అవతార కార్యముండదు.

పరబ్రహ్మలో ఒక అంశము సగుణబ్రహ్మమై విశ్వమవుతుంది – "పాదోస్య విశ్వభూతాని" అన్నట్లు. ఆ విశ్వం సగుణ బ్రహ్మయొక్క దేహం రూపం. దాని అంగాలు దేవతలు పురుషసూక్తం చెప్పినట్లు. దాని ఆత్మగా ఉన్న పరబ్రహ్మ వైపునుండి ఆయన దేహము, అవయవాలు భిన్నంగావు – మన దేహము, యింద్రియాలు భిన్నంగా అనుభవంగానట్లే. కాని యింద్రియాలు అవయవాల వైపు నుండి దేవతలవైపు నుండి చూస్తే వారు భాగాలు మాత్రమే. సమిష్టి గారు. అందుకే పరబ్రహ్మ స్వరూపియైన సద్గురువుకు దేవతలు ఆధీనులు. వారిని తిండి గుడ్డల కాశ్రయిస్తే, లక్ష్మి వారి ఆదేశానుసారం మనను కటాక్షించి తీరాలి.

దేవతలుండడమన్నది మనకిప్పుడు గోచరించే జగత్తు, దేహేంద్రియాలూ ఎంత వాస్తవమో అంతే వాస్తవాలు. ఎక్కువాగాదు తక్కువాగాదు. మాయలోనుండి చూస్తే నిజంగా వుంటారు. ఆత్మ దృష్టితో చూస్తే 'ఏకం సత్' సత్యమైన ఉనికిగల దొక్కటే. నవలా రచనలో రచయిత తననొక పాత్రగా ప్రవేశపెట్టుకొనడంలాంటిది సద్గురువు యొక్క రూపం. ఇతర పాత్రలూ అతడి మనోరూపాలే అయినా తన ప్రతిరూపం మాత్రము అవేవీ కాని రీతిన తాను, మిగిలిన పాత్రలేవీ కానివిధంగా ఆ పాత్రలన్నీ అతని ప్రతినిధి యొక్క మూలతత్త్వం (రచయిత మనస్సు) యొక్క రూపాలు.

కృష్ణుడు భగవద్గీతలో తన తత్త్వం గురించి "యథామామ్" అన్నది ఆయన ప్రత్యేకమైన యోగస్థితిలో చెప్పినవి మాత్రమే. ఉత్తరగీత ప్రమాణం చూపానుగా? సద్గురువు ఎల్లప్పుడూ అట్టి స్థితిలోనే ఉంటాడు. అందుకే 'శ్రీ గురుచరిత్ర', 'సాయిలీలామృతాలలో దేవతలే తమ భక్తులను సద్గురువు నాశ్రయించమనడం చూడవచ్చు.

సద్గురువు సగుణ నిర్గుణ బ్రహ్మల సమైక్య రూపమని తెలిసిన భక్తుల దృష్టిలో వేరు దైవాలంటూ వుండరు. బౌద్ధులు, జైనులూ, సూఫీల ధర్మాలకు గూడ మూలమిదే. "గురువే సకల దేవతలున్నూ" అన్న సాయి సూక్తే. ఈ సత్యాన్ని వాక్యరూపంగా గాక దృశ్యరూపంగా గుర్తుంచుకోడానికే శిరిడీలో భక్తులు విగ్రహ ప్రతిష్ట చేసినది. •

*(జూన్ 2012 సాయిబాబా మాసపత్రిక నుండి)*

# అభయప్రదాత

**పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ**

'భయము' అన్నది చాలా భయంకరమైన విషయము. అసలు భయమంటే ఏమిటో అది మనందరికీ చాలా సందర్భాలలో అనుభవమవుతుంది గనుక తెలుసు.

భయము అనేక రకాలు. సాధారణంగా క్రూర జంతువులను చూస్తే ఎవరికైనా భయమేస్తుంది. ఉదాహరణకు పులి, సింహము, పాము మొ॥వి మనలను కరుస్తాయి, ప్రాణాలు తీస్తాయి గనుక భయపడడం సహజమే! కానీ కొంతమందికి మనకేమీ హాని చేయని జీవులను చూస్తేగూడ భయమేస్తుంది. పిల్లిని చూసి కొందరు భయపడితే, బల్లిని చూసి భయపడేవారు కొందరు. కొందరు పురుగులను చూసి, ఎలుకలను చూసి, బొద్దింకలను చూసిగూడ భయపడతారు. అవి మనకు పెద్దగా హాని చేయవు. కానీ భయపడడమెందుకు? అంటే ఇక్కడ భయానికి కారణం వాటి ఆకారాలను చూస్తే మనకు గల అసహ్యమే!

ఇవి గాక జీవితంలో యింకా చాలా భయాలుంటాయి. చదువుకోకపోతే జీవితం గడిచేదెలా? అన్న భయం. చదువుకున్న తర్వాత ఉద్యోగం రాదేమోనన్న భయం. ఉద్యోగం వస్తే పోతుందేమోనన్న భయం. సంపాదించిన డబ్బును ఎవరైనా కాజేస్తారేమోనన్న భయం. దొంగలు దోచేస్తారేమోనన్న భయం. ఖర్చు పెట్టుకుంటే భవిష్యత్తు ఎలా? అన్న భయం. డబ్బు ఆశతో ఎవరైనా ఏదైనా చేస్తారేమోనన్న భయం.

అలాగే దారిద్ర్యమంటే భయం. అనారోగ్యమంటే చాలా భయం.

అన్నింటికంటే గొప్పది మృత్యువు గూర్చిన భయం. ప్రతి మనిషికీ మృత్యువంటే ఎంతో భయం. కారణం 'తన' అనుకున్న వాటిని అన్నింటినీ విడిచి వెళ్ళిపోవలసి వస్తుందని. తన వాటి మీద వున్న మమకారం అందుకు కారణం. అందుకని మృత్యువు నుంచి తప్పించుకోవాలని ప్రతి మనిషీ కోరుకుంటాడు. వయసు పెరిగిన కొద్దీ ఏ క్షణాన మృత్యువు కబళిస్తుందోనన్న భయం పీడిస్తుంది. నడి వయసులో వున్న వారికి అభద్రతాభావం వల్ల భయం.

యువకులకు మరణభీతి వుండకపోవచ్చుగానీ ఎదుర్కొంటున్న పరిస్థితిల వల్ల ఆందోళన, భయము వుంటున్నాయి. కనుక ఏ మానవుడూ పూర్తి నిర్భయంగా వుండలేకపోతున్నాడు.


కలిప్రభావం వలన స్వార్థం పెచ్చుపెరగడం వల్ల నేడు భయం విలయతాండవం చేస్తున్నది. ఏదో జరుగుతుందేమోనన్న భయంతో నేటి మానవుడు కొట్టుమిట్టాడుతున్నాడు. ఏదో పైకి కొంత ధైర్యంగా వున్నట్లు కనిపించినప్పటికీ అది అంతంతమాత్రమే. నేడు మనిషికి సాటి మనిషంటేనే ఎక్కువ భయమని అనిపిస్తున్నది. పేదవారి దగ్గరనుంచీ గొప్ప ధనవంతులదాకా, సామాన్యుల దగ్గరనుంచీ రాజ్యమేలుతున్న వారి దాకా ఈ భయం సహజమైపోయింది.

ఈ రోజులలో ఎవరు ఎవరిని ఏమైనా చేయవచ్చు. అనేక కారణాలుగా ఎవరు ఏ విధంగానైనా కక్ష తీర్చుకోవచ్చు. ధనం కాజేయవచ్చు. ప్రాణాలనే తీసేయవచ్చు. కొందరు మనుషులు జంతువుల కంటే హీనంగా ప్రవర్తిస్తున్నారనడంలో సందేహం లేదు. జంతువులకంటే అని ఎందుకు అనుకోవలసివస్తున్నదంటే జంతువులు ఆహారం కోసమో లేక ప్రాణభీతి వల్లనో మాత్రమే ఇతర జీవులపై దాడి చేస్తాయి. మనుషులు అలాంటి కారణాలేవీ లేకుండా గూడ అనేక విధాలుగా పీడిస్తున్నారు.

అసలు మనిషికి వుండవలసినది సాటి మనిషి మనకు తోడు వున్నాడన్న ధైర్యం. అందుకే మానవుడు సాటి మానవులను తోడుగా కోరుకుంటాడు. సమాజం ఏర్పడినది అలానే. కానీ తోడుగా వుండవలసిన సాటి మానవుడు పీడగా మారుతుంటే చేయగలిగినదేమున్నది? కంచే చేను మేస్తే కాపాడేదెవరు?

ఇదివరకు మనిషికి మనిషి తోడుగా వుండేవాడు. తనకు తల్లిదండ్రులు అండగా వున్నారన్న ధైర్యం, తోబుట్టువులు వున్నారనే ధైర్యం, పిల్లలు వున్నారనే ధైర్యం, మేనమామలు, పినతండ్రులు, బంధువులు యిలా ఎందరో అండగా వున్నారనే ధైర్యం వుండేది. ఏ శుభకార్యమొచ్చినా, ఆపద వచ్చినా అందరూ లేక ఏ కొందరైనా ఏదో ఒక విధంగా అండగా నిలిచేవారు. ఉదాహరణకు ఒక ఇంట్లో పెండ్లి వస్తే సంబంధాలు చూడడం దగ్గరనుంచీ అందరూ పూనుకునేవారు. అలాగే ఎవరైనా మరణించినా అంతే. ఒకరింట్లో తల్లి చనిపోతే పసిపిల్లలుంటే వారిని బంధువులలో తలా ఒకరూ తీసుకెళ్ళి పెంచేవారు. వారు సరిగా చూసారా, లేదా, అన్నది ప్రశ్నగాదు. మేమున్నామనేదే అక్కడ ముఖ్యము. తల్లికి పాలు లేకపోతే ఇంట్లో పసిపిల్లలున్న తల్లులు పాలిచ్చేవారు. లేక దాదులు వుండేవారు. అలాగే మిగతా విషయాల్లోనూ, ఇంట్లో వాళ్ళు, బంధువులు, స్నేహితులు, ఊరి పెద్దలు వారి శ్రేయస్సుకై పాటుపడేవారు. అలాగే వీరు గూడా వారికి సహకరించేవారు.

నేటి పరిస్థితి పూర్తి వేరుగా వున్నది. క్రిందటి తరం వరకూ అరకొరగా వున్న అనుబంధాలు ఈ రోజు పూర్తిగా లేవేమో అనిపిస్తున్నాయి. ఇప్పుడు ప్రతివారూ, "మాకు ఎవరు అవసరం లేదు. ఎవరికీ మేము అవసరం వుండనక్కరలేదు"



అనే విధంగా వుంటున్నారు. ఇట్టి స్వార్థపరమైన ఆలోచనలు, ప్రవర్తనల వల్లనే భయం కలుగుతున్నది.

అందుకని ఈ భయాలను నివారించుకోవడానికి చాలామంది దైవాన్నీ, మహాత్ములను ఆశ్రయిస్తున్నారు. వారి అతీత శక్తుల వలన వారు మన భయాలను తొలగిస్తారేమోననే ఆశ. అందువలన కొన్ని సమస్యల భయం తొలగినా పూర్తిగా నిర్భయులుగా వుండలేకపోతున్నారు. అందుకు కారణం అధర్మం పెచ్చుపెరగడమే. ఈనాడు అధర్మం ప్రపంచ మంతటా అనేక విధాలుగా విలయతాండవం చేస్తున్నది. దాని పర్యవసానమే అంతులేని భయం.

కొందరు భగవంతుని, మహాత్ములను ఆశ్రయించి గూడ అధర్మ ప్రవర్తకులై వుంటున్నారు. కొంతమంది ధర్మం ప్రకారం నడుద్దామనుకున్నప్పటికీ సమాజానికి ఎదురీతకు భయపడి తల ఒగ్గవలసి వస్తుంది. ఇతరులు అధర్మ ప్రవర్తకులయినప్పుడు భయం కలగడం సహజమే గానీ, ధర్మం ప్రకారం నిలబడే ధైర్యం కలిగివుండాలి. మన ధర్మం మనలను కాపాడుతుంది. "ధర్మో రక్షతి రక్షితః" "ధర్మాన్ని రక్షిస్తే, ధర్మం రక్షించిన వాడిని రక్షిస్తుంది" అని పెద్దల వాక్యం. కనుక ధర్మాన్ని అంటిపెట్టుకున్న వాడికి ధర్మం వుంటుంది, వుండాలి. మనం ధర్మంగా వున్నా అవతలివాడు అధర్మంతో

మనలను మోసం చేస్తున్నాడు, అన్యాయం చేస్తున్నాడు. ఇంకా ఏమైనా చేయడానికి వెనుకాడడం లేదు కదా! మరి మనకు ధైర్యం ఎలా వుంటుంది? అని కొందరనవచ్చు.

సమాజంలో ధర్మాన్ని నిలబెట్టడానికి ఎంతో మంది కృషి చేసారు. ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారు. కానీ వాళ్ళు ధైర్యాన్ని సడలుకోలేదు. ఉదాహరణకు గాంధీ మహాత్ముడినే తీసుకుంటే స్వతంత్రానికై జీవితాంతం కృషి చేసారు. ఆనాడు ఆయన అలా అనుకుని వుంటే స్వతంత్రాన్ని సాధించగలిగేవాడా? ఆయన చేసేది తప్పుగాదని, ధర్మమనీ ఆయనకు తెలుసు! అంతేగాదు, ఆయన ననుసరించి కొన్ని కోట్లమంది ధర్మయుతమైన పోరాటం సాగించారు. ఆ పోరాటంలో ఎందరో ప్రాణాలను సైతం కోల్పోయారు. అయితే ఆనాడు అంతమంది ఎలా ప్రతిస్పందిచారు? మనిషికి అన్నింటికంటే ఎక్కువదైన ప్రాణభీతిని సైతం వారెలా అధిగమించగలిగారు! దానికి కారణం అలా చేయడమే శ్రేయస్కరమని వారికి తెలుసు గనుక.

ఆనాడు పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక ముస్లిము ఫకీరుయైన శ్రీ శిరిడీ సాయినాథుని తత్త్వాన్ని గూర్చి ప్రచారం చేయడంలో ఎన్నో ఇబ్బందులను, ఎంతో వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఆనాడు ఆయన భయపడి వుంటే ఈనాడు మనం సాయిని యింతగా సేవించి శ్రేయస్సుకు పొందగలిగేవాళ్ళమేనా? ఈ ఒక్క విషయం ఆలోచిస్తే చాలు, ధర్మం యొక్క ఫలితం ఎలా వుంటుందో అవగతమవుతుంది.

అయితే ఈ కాలంలో అధర్మాన్ని ఎదుర్కోగల అంతటి గుండె ధైర్యం మనకున్నదా? అన్నది ప్రశ్న. దానికి సమాధానం 'లేదు' అనే. అయితే మనమేమి చేయాలి? దీనికి పరిష్కారమేమిటి? మనం అధర్మం చేయకపోయినా అధర్మానికి దోహదం చేస్తూవుండవలసినదేనా?

దీనికి పరిష్కారాలు రెండు.

మొదటిది సద్గురువును ఆశ్రయించడం.దానిని మనం చేసాము. అంటే సమర్థ సద్గురువైన సాయినాథుని ఆశ్రయించాము. అయినా అధర్మంలో పాలుపంచుకుంటూనే వున్నాము. అంటే అధర్మాన్ని పరోక్షంగా ప్రోత్సహించిన వాళ్లమవుతున్నాము. దోహదం చేస్తున్న వాళ్ళమవుతున్నాము. అభయప్రదాత అయిన సాయిని ఆశ్రయించిగూడ సాటి మానవుల పట్ల భయంతో అధర్మానికి దోహదం చేయడంలో అర్థమేముంటుంది? "అయితే అట్లా వుంటే ప్రపంచంలో బ్రతకలేముకదా! శ్రీ సాయి అన్ని సమస్యలను తీర్చడం లేదు గదా!" అని అనిపించవచ్చు. నిజమే. ధర్మం కోసం నిలబడడంలో కొన్ని ఇబ్బందులు పడవలసిరావచ్చు. కానీ ధర్మంలో ధైర్యం వుంది. సంతృప్తి వుంది. ఆనందం వుంది. అందుకే ఆనాడు ధర్మవర్తనులైన పాండవులు అడవులపాలై కష్టాలు పడినా సంతృప్తిగా, ఆనందంగా వుండగలిగారు. అధర్మపరులైన ధుర్యోధనాదులు రాజ్యభోగాలు అనుభవిస్తున్నప్పటికీ అశాంతితో కుతకుతలాడిపోయారు. ధర్మరాజాదులు అడవులలో ఆకులలములు తింటూ అలమటించిపోయారని మనమనుకుంటాము. కానీ ధర్మం ముందు తినేది ఆకులలములే అయినా సంతృప్తినిచ్చాయి. వారి దురవస్థకు వారు కుమిలి పోలేదు. క్రోధంతో ఉడికి పోలేదు. కర్తవ్య నిర్వహణకు ఎప్పుడూ సంసిద్ధులై వున్నారు. వారే గాదు, సంఘుసంస్కర్తలందరూ సమాజంలో ప్రతిఘటనను ఎదుర్కొన్నారు. అలాగే నిజమైన భక్తులు గూడ అంతే. లక్ష్యం కోసం, ధర్మం కోసం ప్రాకులాడడంలో వారు ఏమి తిన్నామనిగాని, ఏమి కట్టుకున్నామనిగానీ, ఎక్కడ వున్నామని గానీ అనుకోరు. ఆహారం తీసుకున్నామని, వస్త్రాలు ధరించామని, ఆచ్ఛాదన క్రింద వున్నామనీ అనుకుంటారు. అందుకే సంతృప్తిగా వుంటారు.

అట్లా అని ఎవరితోనూ తగవుపెట్టుకోమని గాదు. మనకున్న పరిధిలో, మనకున్న శక్తితో, మనకున్న అవకాశాలతో ధర్మం కోసం పాటుపడాలి. అప్పుడు బాబా మనకు అండగా వుంటారు. 'నా భక్తుల సత్సంకల్పాలు నేను నెరవేరుస్తాను' అని బాబా అభయమిచ్చివున్నారు. ఇంతటి సత్సంకల్పం మనకు కలిగి ప్రయత్నిస్తున్నప్పుడు ఆయన ఎందుకు రక్షించరు? ఆనాడు పాండవులకు శ్రీ కృష్ణుడు అండగా నిలవలేదా? వారు అత్యవసర పరిస్థితులలో, అవసరమైన విధంగా మన వెంట వుండి రక్షిస్తూ నడిపిస్తూవుంటారు. దీనిని గుర్తుపెట్టుకుని మనం ధర్మాచరణకు ప్రయత్నం చేయాలి.

దీనికి రెండవ పరిష్కార మార్గం

'సమైక్యత'. అధర్మాన్ని పోషించకుండా వుండాలంటే సమైక్యత కావాలి. అయితే ఎవరికి వారే అన్నట్లు వుండే ఈ రోజుల్లో సమైక్యత సాధించేదెలా? ఈ సృష్టిలో దేనికైనా పరిష్కారమార్గముంటుంది. 'మనసుంటే మార్గముంటుంది' అన్నది సామెత. మనం హృదయపూర్వకంగా ధర్మబద్ధంగా జీవించాలని సంకల్పించి ఆచరణ ప్రారంభిస్తే మనలాంటి వాళ్ళు మనకు తోడుగా తప్పక నిలుస్తారు. సన్నని దారాలే పేనినప్పుడు పెద్ద త్రాడుగా అయినట్లు సమైక్యత వల్ల సాధించలేనిదేదీ వుండదు. ఆనాడు స్వతంత్రోద్యమంలో పోరాడినపుడు ఆ సమైక్యతే పనిచేసింది. ఆంగ్లేయులను వెళ్ళగొట్టింది. అదే సూత్రం ఇక్కడ మనం పాటించాలి.

ఉదాహరణకు పాలలో కల్తీ జరుగుతున్నదని మనకు తెలుసు, కల్తీ చేయడం అధర్మమనీ తెలుసు. గేదెలకు హార్మోను ఇంజక్షన్లు యివ్వడం వల్ల ఆ పాలు త్రాగినందువలన హార్మోన్లలో సమతుల్యత లోపించి నేడు పసిపిల్లలకు సైతం ఎన్నోరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. కనుక అధర్మాన్ని అధిగమించాలనుకున్న కొందరం కలిస్తే మనలో పాడి చేయడం తెలిసినవారి దగ్గరనుంచి, స్వచ్ఛమైన పాలను పొందవచ్చు. అలాగే కూరగాయలు మొదలైనవి. అనారోగ్యకరమైన సింథటిక్ దుస్తులకు బదులు చేనేత దుస్తులను ధరించవచ్చు. అందువలన చేనేత కార్మికులకు కొందరికైనా ఉపాధి కల్పించిన వారముగూడ అవుతాము. కలుషితమైన, నిల్వవుండడానికి ఉపయోగించే రసాయన పదార్థాలు కలిసిన తినుబండారాలను కొనుక్కోకుండా ఇంట్లోనే మంచి తినుబండారాలని తయారుచేసుకోవచ్చు. లేక అట్లా తయారు చేసేవారి వద్ద కొనుక్కోవచ్చు. అలానే హోమియో వైద్యం నేర్చుకోవచ్చు. ఆయుర్వేదంలోని యెన్నో చిట్కాలతో చిన్న చిన్న వ్యాధులను నివారించుకోవచ్చు. దాని వలన ప్రతి చిన్నదానికి ఆస్పత్రులకు పరుగెత్తవలసిన అవసరం వుండదు. అందువలన డబ్బు ఖర్చు గూడ తగ్గించుకోవచ్చు. మన పెరట్లోనే మనకు అవసరమైన చిన్న చిన్న మొక్కలను పెంచుకోవచ్చు.

మన పిల్లలకు మనమే పాఠాలను చెప్పుకుని సరైన విద్యను అందించవచ్చు. నేటి సమాజంలో పెచ్చు పెరుగుతున్న అశ్లీల సాహిత్యము, వెర్రితలలు వేస్తున్న ఫ్యాషన్లు, నైతికంగా ప్రక్కదారి పట్టిస్తున్న సినిమాలు, నేడు సమాజంలో జరుగుతున్న అన్యాయాలు – వీటి పర్యవసానాల గురించి వివరించి చెప్పి మన పిల్లలను ఉత్తమ వ్యక్తిత్వం గలవారిగా తీర్చిదిద్దుకోవచ్చు. మన పిల్లలకేగాక సాటివారిని గూడ అధర్మం వలన వచ్చే పర్యవసానలేమిటో తెలియజెప్పి ధర్మప్రవర్తకులుగా మలచడానికి ప్రయత్నించవచ్చు. ఇలా చిన్నవాటితో ప్రారంభించి మనతో సహకరించేవారి సంఖ్య పెరిగిన కొద్దీ క్రమంగా బృహత్తర కార్యక్రమాలను గూడ చేపట్టి విజయం సాధించవచ్చు.

కనుక ముందుగా అధర్మప్రవర్తన ఎందుకు సరియైనది కాదో తెలుసుకోవాలి. అధర్మం పట్ల స్పష్టమైన అవగాహన కలిగివుండాలి. ఖచ్చితమైన వ్యతిరేకత ఏర్పరచుకోవాలి. ధర్మం కోసం నిలబడే మానసిక స్థైర్యాన్ని, ధైర్యాన్ని అలవరచుకోవాలి. అధర్మప్రవర్తకులు తాము చేసేపని ఎంత నీచమైనదైనా, దాని పర్యవసానాలు ఎలా వుంటాయోనన్న భయము, లజ్జ లేకుండా చేయగలుగుతున్నప్పుడు ధర్మం కోసం మనమెందుకు భయపడుతున్నాము! ఇది ఆలోచించాలి.

అందుకు మనం చేయవలసినదల్లా పైన చెప్పుకున్న విధంగా సమైక్యత కలిగి వుండడము. ధర్మరక్షకుడు అయిన సాయి మన వెంటవుండి నడిపిస్తారన్న ధైర్యం కలిగి వుండడం. ధర్మం కోసం ప్రయత్నిస్తున్నప్పుడు సాయి అవసరమైన సమయంలో అవసరమైన విధంగా కాపాడుతారు అన్న విశ్వాసం కలిగివుండడం. వీటినన్నింటిని సాటివారికి తెలియజెప్పి వారిని గూడ ధర్మ ప్రవర్తకులుగా చేయడానికి ప్రయత్నించడం.

అభయప్రదాత అయిన సాయి వుండగా మనకు భయమెందుకు!

ఈ కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా వీటిని మనం అలవరచుకుని ముందుకు సాగడమే దీక్షగా పెట్టుకుందాము. మనలను ఈ మార్గంలో చేయిపట్టి నడిపించమని శ్రీ సాయినాథుని, పూజ్యశ్రీ మాస్టరుగారినీ మనసారా ప్రార్థిద్దాము.

జై సాయి మాస్టర్!

# మాతృదేవి స్మృతులు

*శ్రీమతి రమాదేవి, నాగోలు*

హైదరాబాదులోని నాగోలు సత్సంగ సభ్యురాలు శ్రీమతి రమాదేవి గారు, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లితో వారి జ్ఞాపకాలు ఈ విధంగా పంచుకుంటున్నారు.

పూజ్యశ్రీ అమ్మగారు ఒంగోలు నుంచి చిక్కడపల్లి వచ్చే సమయానికి మేము చిక్కడపల్లిలోనే ఉండేవాళ్ళం. పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో మొదటిసారి వరలక్ష్మీవ్రతం చేసుకున్నప్పుడు అక్కడవున్న సత్సంగ సభ్యులందరం కలిసి పాదపూజ చేసుకున్నాము. నేను అంతదగ్గరగా అమ్మగారిని చూడటం అదే మొదటిసారి. పూజ్యశ్రీ అమ్మగారి నిలయానికి రోజూ మావారు (శ్రీరాములు గారు), మా అమ్మాయి (సువర్చల) వెళ్లేవారు. నేను అప్పుడప్పుడూ వెళ్ళేదాన్ని. రెండవ సంవత్సరం వరలక్ష్మీవ్రతం తిరుమలగిరిలో చేశారు. అప్పుడు మా అమ్మాయి, మావారు వెళ్లారు. నేను వెళ్ళలేకపోయాను. క్రిందటి సంవత్సరం వరలక్ష్మీవ్రతం తలచుకుంటూ పడుకున్నాను. అప్పుడు ఒక స్వప్నం వచ్చింది.పూజ్యశ్రీ అమ్మగారు మా ఇంటికి వస్తున్నారని ఎవరో అంటున్నారు. నేను ఎదురువెళ్ళి అమ్మగారు కూర్చున్న ఆసనాన్ని పట్టుకుని తీసుకుని వచ్చాను. మా వంటింట్లో బాబాపటం వున్నచోట కూర్చున్నారు. నన్ను వంట చెయ్యమన్నారు. వంటయ్యాక పూజ్యశ్రీ అమ్మగారే స్వయంగా అన్నం కలిపి అందరికి ముద్దలు పెట్టారు. నా కోరిక ఆ విధంగా తీర్చారు. అలా పూజ్యశ్రీ అమ్మగారు ఎంతటివారో కొంచెం అవగాహనకి వచ్చింది.

పూజ్యశ్రీ అమ్మగారు ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహప్రతిష్టకి కావలి వెళ్లారు. మావారు కూడా వెళ్లారు. కానీ తిరిగి ఎప్పుడు వచ్చేది చెప్పలేదు. నేను, పిల్లలు ఇక్కడ (హైదరాబాదులో) వున్నాము. రెండు రోజుల తరవాత, ఇంకా రాకపోయేసరికి నాకు భయమేసింది. ఆ రోజు పూజ్యశ్రీ అమ్మగారు నాకు ఫోన్ చేశారు. అనుకోని ఈ సంఘటనకి నేను ఆశ్చర్యపోయాను. మాటలు తడబడిపోయాయి. అప్పుడు అమ్మగారు నాకు ఒక పని చెప్పి మేము వచ్చేసరికి చెయ్యమని చెప్పారు. నాకు అప్పుడు మనసుకు చాలా ఊరట కలిగి ధైర్యం వచ్చింది. మనస్ఫూర్తిగా అమ్మగారిని తలచుకుంటే చాలు, వెంటనే కరుణిస్తారు.

ఒకసారి గాణగాపూర్ యాత్ర గురించి అమ్మగారు వేరొకరితో మాట్లాడుతున్నారు. అప్పుడు అక్కడే వున్న నేను అమ్మగారితో, "నేనూ రావచ్చా అమ్మా" అనడిగాను. "అయ్యో! నీకు తెలీదా" అన్నారు. "నాకెవరూ చెప్పలేదమ్మా" అన్నాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "ఇంటివాళ్ళకి చెప్పేదేమిటి, నువ్వుకూడా రా" అన్నారు. నేను ఆ మాట విని ఆనందం పట్టలేక పూజ్యశ్రీ అమ్మగారి పాదాలు పట్టుకుని చాలా సేపు ఏడ్చాను. పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర ప్రతివాళ్ళు మాతృప్రేమను పొందుతారు. నేను కూడా ఆ ప్రేమని చవిచూశాను. పూజ్యశ్రీ అమ్మగారిని అడిగేదానిని, నాకు మీమీద వుండే ప్రేమని తగ్గిపోకుండా చూడమని. పూజ్యశ్రీ అమ్మగారు నేను వారి దగ్గర చెప్పుకునే విషయాలన్నింటిలో నాకు మంచిచెడ్డలు చెబుతూ, 'నాకు ఏమైనా అమ్మగారు వున్నారు' అనే ధైర్యాన్ని కలిగించారు. ఈరోజుకి నాకదే ధైర్యం.

కొన్నాళ్ళకి పూజశ్రీ అమ్మగారు మల్కాజిగిరికి వెళ్లారు. మేమందరం అప్పుడు ఒకే అపార్టుమెంటులో ఉండేవాళ్ళం. అప్పటి నించి నాకు 'లోపలిసేవ' మొదలయ్యింది. చాలా భయంగా వుండేది. ఏ పని ఎలాచెయ్యాలో తెలిసేదికాదు. అన్నీ పూజ్యశ్రీ అమ్మగారే నేర్పించారు.



'భూమాత కున్నంత ఓర్పు' అంటారు కదా, అదినేను పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర చూసాను. అంతటి ఓర్పు రావాలాంటే ఎన్ని జన్మలు పడుతుందో అనిపిస్తుంది. పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల మేము మల్కాజిగిరిలో ఇల్లు కొనుక్కున్నాము. పిల్లలిద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి.

పూజ్యశ్రీ అమ్మగారు నాగోలుకి వచ్చాక, నేను మా అమ్మాయి ప్రసవ సమయానికి తోడుండటం కోసం ఆస్ట్రేలియా వెళ్లాను. నేను వెళ్ళేసరికే ప్రసవమై బాబు పుట్టాడు. కానీ తరవాత ఆరోగ్యపరంగా చాలా సమస్యలు వచ్చాయి. అవన్నీ పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల సర్దుకున్నాయి. నాకు అక్కడి వాతావరణం నచ్చక, అక్కడి నిశ్శబ్దం భరించలేక, బాబుకి మూడు నెలలు వచ్చాక 'నేను వెళ్ళిపోతాను' అనేదానిని. బాగా ఏడుపు వచ్చేది. అప్పుడు ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారు కలలోకి వచ్చి, "ఎందుకలా వచ్చేస్తానని ఏడుస్తున్నావు? పిల్ల ఎంత గండంనుంచి బైటపడింది. నీ బాధ్యత కాదా? ఉండక పోతే ఎలా?" అన్నారు. పూజ్యశ్రీ అమ్మగారు అలా చెప్పాక కొంచం బాధ తగ్గింది. ఎలాగో బాబుకి 7 నెలలు వచ్చేదాకా వుండి, మా అమ్మాయిని, బాబుని తీసుకుని నాగోలుకి వచ్చాను.

అలా పూజ్యశ్రీ అమ్మగారితో మా ప్రయాణం చిక్కడపల్లి నుంచి నాగోలు వరకు వచ్చింది. నా జీవితం అంతా కూడా పూజ్యశ్రీ అమ్మగారి పాదపద్మముల దగ్గరే గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను, సేవ అంటే, మహాత్ములంటే తెలియని మమ్మలిని చేరదీసి, ఎన్నో విషయాలలో అండగా నిలిచి, మాకు చక్కటి జీవితాన్ని ప్రసాదించిన పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లికి, శత సహస్ర కోటి కృతజ్ఞతా పూర్వక ప్రణామములు తెలియచేసుకుంటున్నాను. ●

## సాయినాథుడు నిత్య యాత్ర...

03వ పేజీ తరువాయి

అంతటి ప్రత్యక్ష సాయి సేవకుడు కూడా చలించిపోయాడు కాబోలు, అంతటితో సాయి సమాధి చెందిన తర్వాత ఆయన యొక్క దివ్యమహిమ అంతరించి పోయిందని, అప్పుడు భక్తులకనుభవం అవుతున్న అద్భుతాలన్నీ, దివ్యానుభవాలన్నీ తన ఆధ్యాత్మికశక్తి వల్లనే కలుగుతున్నాయని అబ్దుల్లా చెప్పనారంభించాడు. చాలామంది బాబా భక్తులు కూడా అతని మాటను విశ్వసించేవారు. వీరిలో స్థానికులు కూడా వుండేవారు. అలా విశ్వసించిన వారిలో దస్తగిరి ఒకడు. ఒకరోజతడు తన స్థానానికి వెళ్లడానికి అబ్దుల్లా ఆశీర్వచనము, అనుమతి కోరాడు వెనక సాయిని కోరినట్లే. వెంటనే అబ్దుల్లా మందహాసం చేసి అతనిని ఆశీర్వదించి, "వెళ్ళు, నీకు రైలు అందుతుంది" అని చెప్పి పంపాడు. దస్తగిరి వెళ్ళాడు, కానీ అతనికి రైలు అందలేదు. అతడు పట్టరాని కోపంతో మరల శిరిడీ వచ్చి అబ్దుల్లాతో "ఇక నీ బూటకాలు చాలు. అన్ని దశాబ్దాలలో సాయి నోటనుండి వెలువడిన ఎంత చిన్నమాటైనా నిలువకుండా పోయిందా? ఎందుకు అనవసరంగా ప్రజలను మోసం చేస్తావు? ఇది నీకూ మంచిది కాదు" అని మందలించి వెళ్ళిపోయాడు. నాటినుండి అబ్దుల్లా అలా చెప్పడం, ప్రవర్తించడం మానేశాడు. ●

# వార్తాలాపము

(సెప్టెంబరు సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

**శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.**

## తొమ్మిదవ ప్రసంగము

*17.* ***అలోలుప్త్వమ్ :-*** ఇంద్రియాలలో సామర్థ్యం వున్నప్పుడు కూడా విషయాలపట్ల వికారం చెందకుండా వుండడం, ఇతరులు భోగాలను అనుభవించడం చూసి కూడా వాటిపట్ల మనస్సు వ్యామోహపడకపోవడం అలోలుప్త్వము.

నచికేతుడు యముడిని ఆత్మవిద్య నేర్పమని కోరాడు. యముడు అతనికి దీర్ఘాయువు, అందమైన స్త్రీలు, అంతులేని ధనము మొ॥న అనేక రకాలైన భోగాలు, ఐశ్వర్యాలను అనుభవించే సాధనాలను అనేక విధాలుగా వివరించాడు. కానీ అతడు ఆశపడలేదు. అప్పుడు యముడు సంతోషించి ఇలా అన్నాడు –

**విద్యాభీప్సినం నచికేతసం మన్యే, న త్వా కామా బహవోఽలోలుపన్త**

**భావం :** నీవు జ్ఞానాన్నే కోరుతున్నావని ఇప్పుడు నమ్ముతున్నాను. ఎందుకంటే నీకు రకరకాల పదార్థాలపట్ల (విషయాలయందు) కోరిక కలగలేదు.

ఇలా పలికి నచికేతుడికి ఆత్మవిద్యను బోధించాడు.

*18.* ***మార్దవమ్ :-*** అంతఃకరణంలోను, వ్యవహారంలోను కాఠిన్యాన్ని విడిచిపెట్టాలి. దానికి బదులుగా మృదుత్వాన్ని కలిగివుండాలి. మార్దవం ద్వారా లౌకిక వ్యవహారము, పరమాత్మమార్గము – రెండూ కూడా సులభంగా సిద్ధిస్తాయి. ఎలాగంటే,

**శ్లో॥ మృదునా దారుణం హన్తి**
**మృదునా హన్త్యదారుణమ్ ।**
**నాసాధ్యం మృదునా**
**కించిత్తస్మాత్తీవ్రతరం మృదు ॥**

**భావం:** మృదుత్వము కాఠిన్యాన్ని నశింపజేస్తుంది. అదే మృదుత్వాన్ని గూడా వశపరచుకుంటుంది. మృదుత్వము ద్వారా సాధ్యముకానిది ఏదీ లేదు. కాబట్టి కాఠిన్యము కంటే మృదుత్వమే ఎంతో శక్తివంతమైనది.

**శ్లో॥ యస్య చిత్తం ద్రవీభూతం**
**కృపయా సర్వజన్తుషు ।**
**తస్య జ్ఞానేన మోక్షేణ కిం**
**జటాభస్మ లేపనైః ॥**

***భావం:*** ఎవని చిత్తము సర్వప్రాణులపట్ల, దయతో కరిగివుంటుందో, అతనికి జ్ఞానముతోను, మోక్షముతోను, జటలతోను, భస్మాలతోను పనేముంది?

*19* ***హ్రీః :-*** లోకవ్యవహారానికి వ్యతిరేకమైన ఆచరణతో ప్రవర్తించడానికి నిర్ణయించుకోకూడదని ధర్మశాస్త్రము చెబుతున్నది.

కాబట్టి అటువంటి విరుద్ధమైన ఆచరణను చేసేటప్పుడు కలిగే సంకోచము లజ్జ. మద్యం అమ్మే దుకాణం దగ్గర స్నేహితులతో నిలబడి వున్నప్పుడు కలిగే భావం లజ్జ.

***శ్లో॥ హ్రీమాన్ హి పాపం***
***విద్వేష్టి తస్య శ్రీరభివర్ధతే l***
***హ్రీః హతా బాధతే ధర్మం***
***ధర్మో హన్తి హతః శ్రియమ్ ll***

***భావం:*** లజ్జ కలవాడు పాపాన్ని ద్వేషిస్తాడు. అతనికి లక్ష్మీ వృద్ధిచెందుతుంది. లజ్జను నాశనము చేస్తే ధర్మం కూడా నశిస్తుంది. ధర్మం నశిస్తే లక్ష్మి కూడా పోతుంది.

*20.* ***అచాపలమ్ :-*** చపలత్వము లేకపోవడమే అచాపలము.

***శ్లో॥ న పాదపాణి చపలో***
***న నేత్ర చపలో యతిః l***
***న చ వాక్చపలశ్చైవమితి***
***శిష్టస్య లక్ష్మణమ్ ॥***

***భావం :*** యతికి కన్నులు, చేతులు, కాళ్లు – వీటివేటిలోనూ చాపల్యము వుండకూడదు. వాక్కులో కూడా చాపల్యము వుండకూడదు. ఇది శిష్టుని లక్షణము.

కాలు మీద కాలు వేసుకొని కూర్చోవడము, కాళ్లు ఊపడము, దారిలో నాలుగువైపులా చూస్తూ నడవడము, అనవసర ప్రసంగాలు చేయడము, అనవసరముగా నవ్వడం – ఇటువంటివన్నీ చాపల్య లక్షణాలు. ఇవి లేకపోవడమే 'అచాపలము'.

***శ్లో॥ తేజః క్షమా ధృతిః***
***శౌచమద్రోహో నాతిమానితా l***
***భవన్తి సంపదం దైవీం***
***అభిజాతస్య భారత ll***

***భావం:*** తేజస్సు, క్షమ, ధృతి, పవిత్రత, శత్రుత్వము లేకపోవడము, తాను పూజ్యుడిని (పూజింపదగినవాడిని) అనే అభిమానము (భావం) పొందకుండడము — ఇవన్నీ దైవీసంపత్తి కల మానవుని లక్షణాలు.

*21.* ***తేజః-*** దైవీసంపత్తి కలవాని ప్రభావము వలన వాడి దగ్గర అసురసంపత్తి కలవాడు చెడ్డ పనులు చేయలేడు. అది దైవీసంపత్తి కలవాని తేజము. అటువంటి తేజోవంతుడైన మానవుడిని భార్య, పిల్లలు, ధనము మొదలైనవి తమ మాయామోహంలో చిక్కించుకోలేవు. వారి దగ్గరకు వచ్చిన మానవుల హృదయాలలో వారి దగ్గర ధనము మొదలైనవి లేకపోయినా, వాటి అంతట అవే పూజ్య భావాలు కలుగుతాయి. అన్ని అనర్థాలకు మూలమైన క్రోధము మొదలైన శత్రువులమీద వారికి విజయం కలుగుతుంది.

ఇటువంటి తేజోవంతుడిని గురించి ఇలా చెప్పబడినది.

***శ్లో॥ యస్తు క్రోధం సముత్పన్నం***
***ప్రజ్ఞయా ప్రతిబాధతే l***
***తేజస్వినం తం విద్వాంసో***
***మన్యన్తే తత్త్వదర్శినః ll***

***భావం:*** తనలో పుట్టిన క్రోధాన్ని బుద్ధితో అణచిన వాడిని విద్వాంసులైన తత్వవేత్తలు 'తేజశ్శాలి' అంటారు.

*22.* ***క్షమా :-*** అపకారము చేసినవాడికి ఎటువంటి శిక్షను విధించకూడదు. పగ తీర్చుకోవాలనే భావన కూడా వుండకూడదు. దేవుడే అందరిని శిక్షిస్తాడనే భావము కూడా వుండకూడదు. అతని తప్పును తప్పుగానే భావించకూడదు. 'భగవంతుడు అతనికి సద్బుద్ధిని కలిగిస్తాడు' అనే విశ్వాసంతో అతని అపకారాన్ని మరచిపోవాలి. ఆ గుణమే క్షమ. క్షమాశీలుడు భగవంతుని పొందడానికి తగినవాడు.

*శ్లో॥ క్షన్తవ్యమేవ సతతం*
*పురుషేణ విజానతా l*
*యదా హి క్షమతే సర్వం*
*బ్రహ్మ సంపద్యతే తదా॥*

**భావం :-** వివేకవంతుడు ఎల్లప్పుడూ ఇతరులను క్షమించాలి. ఎప్పుడైతే అలా క్షమిస్తాడో అప్పుడే అతడు బ్రహ్మప్రాప్తికి అర్హుడౌతాడు.

*శ్లో॥ క్షమా తేజస్వినాం తేజః*
*క్షమా బ్రహ్మ తపస్వినామ్ l*
*క్షమా సత్యం సత్యవతాం*
*క్షమా యజ్ఞః క్షమాశమః ll*

**భావం :-** క్షమ తేజోవంతుల తేజము. క్షమ తపశ్శాలుల బ్రహ్మము. క్షమ సత్యనిరతుల సత్యము. క్షేమయే యజ్ఞము. క్షేమయే శమము.

*23 ధృతి :-* శాస్త్రాలలో ధైర్యవంతుడి లక్షణము ఇలా వున్నది –

*శ్లో॥ నా ప్రాప్యమభివాఞ్ఛన్తి*
*నష్టం నేచ్ఛన్తి శోచితుమ్ l*
*ఆపత్సుచ న ముహ్యన్తి*
*నరా ధృతియుతాః సదా॥*

**భావం:-** వారు పొందడానికి వీలులేని వస్తువులను కోరుకోరు. నశించిన వస్తువుల గురించి విచారించరు. ఆపదలలో బుద్ధిని కోల్పోరు, బాధపడరు. స్థిరమైన బుద్ధి కలిగి వుంటారు. అటువంటివారు ధైర్యశాలురు.

చాలా భయంకరమైన, అత్యంత విషమమైన పరిస్థితులలో కూడా ధైర్యంగా వుండటం ఎంతోమేలు అని మహాభారతంలో చెప్పబడివున్నది.

*శ్లో॥ పుత్రదారైః సుఖైశ్చైవ*
*వియుక్తస్య ధనేన వా l*
*మగ్నస్య వ్యసనే కృచ్ఛే*
*ధృతిః శ్రేయస్కరీ నృపll*

**భావం :** ఓ ధర్మరాజా పిల్లలు, భార్య, ధనము మొ॥నవి నశించడం మొ॥న అత్యంత కఠినమైన బాధలలోనూ, కష్టాలలోనూ చిక్కుకున్నప్పుడు కూడా మానవుడు ధైర్యాన్ని కోల్పోకుండా వుండటం ఎంతో శుభకరము.

*24. శౌచమ్ :* శౌచమంటే పవిత్రత. అది రెండు రకాలు – బాహ్యము, అంతరము. పరిశుద్ధమైన నీటితో శరీరాన్ని శుభ్రంగా వుంచుకోవడం బాహ్య శౌచము. రాగద్వేషాది భావాలు లేకుండా వుండటం అంతర శౌచము.

*శ్లో॥ అభక్ష్యపరిహారశ్చ*
*సంసర్గ శ్చాప్య నిన్దితైః l*
*స్వధర్మే చ వ్యవస్థానం*
*శౌచమేతత్ప్ర కీర్తితమ్ ll*

**భావం:** తినకూడని పదార్థాలను తినకుండడము, సదాచారశీలులైన వారితో సహవాసం చేయడము, తన మతములో స్థిరముగా ఉండటము – ఇది శౌచము.

సాత్విక బుద్ధిని నశింపజేసే పదార్థాలు అభక్ష్యాలు. మాంసము, మద్యము మొదలైన తామసపదార్థాలు అభక్ష్యాలు (తినకూడనివి). వీటిని వదిలివేయాలి.

చరిత్రహీనుడు, తినకూడనివి తిని ఆనందించేవాడు (అభక్ష్య భోగి), అవినీతిపరుడు, ప్రత్యక్ష దోష భాషి (ఎదురుగా మాట్లాడకూడనివి మాట్లాడేవాడు) నిందింపదగినవారు. దీనికి వ్యతిరేకమైన స్వభావం గల సద్గుణవంతుల సహవాసం చేయాలి. ఎంత కష్టమైన పరిస్థితిలో కూడా వర్ణాశ్రమ ధర్మాలను వదిలివేయకూడదు.

జ్ఞాని ఈ దైవసంపద కోసం వాచిక మానసిక శౌచాన్ని పాటిస్తాడు.

*శ్లో॥ వాచాం శౌచం చ మనసః*
*శౌచమిన్ద్రియ నిగ్రహః l*
*సర్వభూతదయా*
*శౌచమేతచ్ఛౌచం పరార్థినామ్ ll*

**భావం:** మనస్సు వాక్కుల పారిశుద్ధ్యము, ఇంద్రియ నిగ్రహము, సర్వభూతాల యందు దయ అంటే పవిత్ర భావము – ఇదిపరోపకార బుద్ధి కలిగినవారు అవలంబించు శౌచము.

**- సశేషం**

(సెప్టెంబరు సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

అమ్మ అయిదారేండ్ల వయసులో ఒకసారి వారింటి ముందున్న మామిడి చెట్టు క్రింద ఆడుకుంటూ వున్నప్పుడు చెట్టుపైన ఒకే ఒక్క పండిన మామిడి పండు కన్పించింది. వెంటనే యింట్లోకి వెళ్ళి తల్లితో "అమ్మా! ఈ రోజు పూజలో దేముడికి మామిడి పండు నైవేద్యం పెట్టావా?" అని అడిగింది. "లేదమ్మా! పెట్టలేదు. మామిడి పండు కొనటానికి మన దగ్గర డబ్బులెక్కడివి?" అన్నది తల్లి. వైశాఖ మాసంలో ప్రతి యింట్లోను, పూజలో ప్రతిరోజు మామిడి పండు నైవేద్యం పెట్టటం ఆ రోజులలో ఆ ప్రాంత వాసుల సంప్రదాయం. తల్లి సమాధానం విన్న ఆనందమయి అమ్మ మామిడి చెట్టు వద్దకు వెళ్ళి చెట్టు పైనున్న పండు వైపు చూడగానే ఆ పండు రాలి ఆమె చేతిలో పడటం జరిగింది. ఆ పండు తల్లికివ్వగానే తల్లి కోపంగా "ఈ పండు ఎక్కడినుండి తెచ్చావ్? అంటూ అమ్మ దానిని ఎవరింటి నుండైనా దొంగిలించి తెచ్చిందేమోనని అనుమానించి "ఇతరుల వస్తువులు తీసుకొనడం చాలా తప్పు" అన్నది. అమ్మ తాను అలా చెయ్యలేదని, చెట్టు పైనుండి రాలితే తెచ్చాననీ చెప్పింది. ఇలాటి ఆశ్చర్యకరమైన సంఘటనలు అమ్మ బాల్యంలో ఎన్నో జరుగుతుండేవి.

క్రీ॥శ॥ 1908 సంవత్సరం మాఘ మాసంలో ఢాకా విక్రమపురం ప్రాంతంలోని అర్ధపాడా గ్రామంలో నివసించే శ్రీ జగద్బంధు చక్రవర్తి – త్రిపురసుందరీ దేవి ల కుమారుడు శ్రీ రమణీమోహన చక్రవర్తిగారితో 12సం॥ల వయస్సులో శ్రీ ఆనందమయి అమ్మకు వివాహం జరిగింది. వారిది శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబం. రమణీమోహన్ గారి చిన్న వయస్సులోనే వారి తల్లి స్వర్గస్థులైనారు. ఆయన వివాహానంతరం సుమారు రెండు సంవత్సరాలకు ఆయన తండ్రిగారు కూడా శివైక్యం పొందటం జరిగింది. కాలాంతరంలో రమణీ మోహన్ గారు ఉద్యోగరీత్యా ఢాకా వెళ్ళిన సమయంలో అచ్చటి భక్తులంతా ఆయనను 'భోలానాథ్' అని పిలువసాగారు. అప్పటి నుండి ఆయన 'భోలానాథ్' అన్న పేరుతో ప్రాచుర్యం పొందారు. అందువలన మనం కూడా యిక నుండీ ఆయనను 'భోలానాథ్ గారు' అని చెప్పుకొందాము.

భోలానాథ్ గారికి యిద్దరు అన్నలు, యిద్దరు తమ్ముళ్ళు, అయిదుగురు సోదరీమణులు. వివాహ సమయానికి ఆయన పోలీసు డిపార్టుమెంటులో పని చేస్తుండేవారు. 1909వ సం॥లో ఆయన ఆ వుద్యోగం మానేసి చాలాకాలం వరకు నిరుద్యోగిగా వున్నారు. ఆ తర్వాత కొన్నాళ్ళు రైల్వే డిపార్టుమెంటులో చాలా చోట్ల స్టేషనుమాస్టర్ గా చేశారు. ఆ తర్వాత అష్టగ్రామ్ అనే వూళ్లో ఢాకా నవాబు గారి ఆధ్వర్యం క్రింద వున్న ప్రాంతంలో సర్వే డిపార్టుమెంటులో పనిచేశారు. ఆ తర్వాత 1917వ సం॥లో అష్టగ్రామ్ నుండి ఆయనను బాజిత్ పూర్ అనే వూరికి బదిలీ చేశారు.

బాజిత్ పూర్ నివాసం అనేది ఆనందమయి అమ్మ జీవితంలో ఒక ముఖ్యమయిన మలుపుగా చెప్పవచ్చు. ఆమె దివ్య అవతార ప్రకటనకు అది ఆరంభ శంఖారావం అనేది నిశ్చయం. ఆ రోజులలో పూజ, భజన సమయాలలో ఆమెకు కలిగే సమాధి స్థితి, ఆమె శరీరంలో ఆమె ప్రయత్నమేమీ లేకుండానే యోగముద్రలు, యోగాసనాలు ప్రకటమవటం క్రమక్రమంగా ప్రజలు గుర్తించి, ఆమె మహనీయతను తెలుసుకొని ఆరాధించటానికి అది ఆరంభ ఘట్టం అయింది.

ప్రతిరోజూ నియమానుసారం ఆమె సాధన కొనసాగేది. అయితే ఆమె ఎటువంటి స్థితిలోను గృహిణిగా తన బాధ్యతలను ఏమారక సక్రమంగా నిర్వర్తించేవారు. వంట చేయటం, పాత్రలు తోమటం, యిల్లు శుభ్రం చేసుకొనటం యిలా సకల గృహకృత్యాలు స్వయంగా నిర్వర్తించేవారు. భోలానాథ్ గారి అవసరాలు గుర్తించి, ఎంతో భక్తిశ్రద్ధలతో ఆయన సేవలు చేసేవారు. రాత్రి భోలానాథ్ గారు నిద్రించిన తర్వాత పడక గదిలోనే ఒక మూల కూర్చునేవారు. ఆ సమయంలో ఆమె శరీరంలో దేవతా ముద్రలు ప్రకటమవుతుండేవి. శరీరం నుండి వెలువడే దివ్యకాంతులతో ఆ గది అంతా వెలిగిపోతుండేది. భోలానాథ్ గారు మేలుకొని వున్న సమయంలో ఆ దృశ్యాలను ఆశ్చర్యంతో తిలకిస్తూ కూర్చుండి పోయేవారు.

మొదట్లో అమ్మ యొక్క యీ చిత్రమైన లీలలను ఎవరూ గుర్తించకపోయినా, కాలక్రమేణా ఇరుగు పొరుగు వారి ద్వారా ప్రజలందరికీ తెలియటంతో అమ్మ గురించి ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా చెప్పుకోవడం మొదలైంది. కొందరు గ్రహపీడగా భావించి ఎవరైనా భూత వైద్యులకు చూపించమనీ, మరికొందరు ఆమెకు ఏదో చిత్రమైన వ్యాధి సోకి వుండవచ్చనీ కనుక మంచి వైద్యుడికి చూపించమనీ భోలానాథ్ గారికి సలహాలు యిస్తుండేవారు.

ఒకసారి ఆనందమయి అమ్మ వద్దకు ఒక భూతవైద్యుని తీసుకొచ్చారు. అతడు అమ్మను తన ఎదురుగా కూర్చోబెట్టుకుని ఏవో మంత్రాలు ఉచ్చరిస్తూ ఏవేవో తాంత్రిక క్రియలు చేయసాగాడు. మౌనంగా అవన్నీ చూస్తూ కూర్చున్నారు అమ్మ. కొంతసేపటి తర్వాత అతడే స్పృహ తప్పి నేలపై పడిపోయాడు. అమ్మ నవ్వుతూ అతడిని లేవదీసి స్పృహ వచ్చేలా చేశారు. అతడు లేచి నిలబడి అమ్మకు భక్తితో నమస్కరించి, "ఈమెకు మేము చేసేది ఏమీలేదు. ఈమె సాక్షాత్తు భగవతీదేవి" అని భోలానాథ్ గారితో అన్నాడు.

సమీప గ్రామమైన 'కాళీకచ్ఛములో 'మహేంద్ర నందజీ' అనే ఒక గొప్ప పేరు ప్రఖ్యాతులున్న ఒక డాక్టరుకు అమ్మను చూపించారు భోలానాథ్ గారు. ఎంతో వుత్తమ సంస్కారవంతుడు, దైవభక్తుడు ఆ డాక్టరు అమ్మను పరిశీలించి, అయిన "ఈమె శరీరంలో వ్యక్త మౌతున్న భంగిమలన్నీ నిశ్చయంగా దైవముద్రలు. అంతేకానీ, యీమెకు ఎటువంటి అనారోగ్యము లేదు. మీరు యీమెను ఏ వైద్యునికీ చూపించవద్దు!" అని చెప్పటంతో ఆ తర్వాత భోలానాథ్ గారు అమ్మను ఏ వైద్యునికీ చూపించలేదు.

ఆనందమయి అమ్మకు అప్పుడప్పుడూ కలిగే స్థితి, అప్రయత్నంగా శరీరంలో యేర్పడే యోగాసనాలు, యోగముద్రలు, యీ శరీర క్రియలతో ఆమె బంధుజనుల నుండీ కూడా ఎన్నో విమర్శలు, యిబ్బందులు ఎదుర్కొన్నారు. భోలానాథ్ గారు బాజిత్ పూర్ లో ఉద్యోగం చేయటానికి ముందు కొంతకాలము అమ్మ తన పెద్ద బావగారైన రేవతీ బాబు గారింట్లో వున్నారు. ఆ రోజుల్లో కూడా అమ్మ వంట పని, యింటి పని స్వయంగా చేసుకునేవారు. ఆమె బావగారి సేవలు కూడా చేసేవారు. ఆమె బావగారు కూడా అమ్మను ఎంతో ఆదరభావంతో చూసేవారు. ఆ రోజుల్లో కూడా ఆమెకు సమాధి స్థితి కలుగుతుండేది. అయితే అది అలాటి దివ్యస్థితి అని ఎవరికీ తెలియదు. వంట చేస్తూ కూడా ఆమె సమాధి స్థితిలో పడిపోవటం చూసి అందరూ 'ఈ కోడలు చాలా నిద్రమనిషి' అనేవారు. వంట పాత్రలన్నీ క్రింద పడిపోయినా ఆమెకు తెలిసేదికాదు. తోడికోడలు వచ్చి చూసి ఆ పరిస్థితికి ఎంతో విసుక్కునేది. అమ్మ మామూలు స్థితికి వచ్చిన తర్వాత జరిగినదంతా చూసి సిగ్గుపడి మరల పనిలో నిమగ్నమయ్యేవారు. అమ్మ ఎంతో శాంత స్వభావురాలు కావటం వల్ల బంధువులు తనను ఎంతగా విమర్శించినా వారిపట్ల కొంచెం కూడా కోపగించుకునేవారు కాదు.

ఆ రోజులలో వీరి బంధువు అయిన 'నిశీకాంత భట్టాచార్య' అనే ఆయన ఒకరు వీరింటికి వచ్చి కొన్నాళ్ళు వున్నారు. అందరి వలెనే ఆయన కూడా అమ్మకు కలిగే శరీరక్రియలు చూసి అవి యోగక్రియలు అని గ్రహించలేక భోలానాథ్ గారితో అమ్మకు వైద్యం చేయించమని ఒత్తిడి చేయసాగారు. ఒకరోజు యీ విషయమై ఏమీ పట్టించుకోవటం లేదంటూ కోపంతో భోలానాథ్ గారిని ఎంతగానో దుర్భాషలాడాడు. ఆ రోజు అమ్మ ఒక గదిలో యోగాసనంలో కూర్చుని వున్నారు. ఆ సమయంలో అమ్మ తలపై మేలి ముసుగు లేదు. ఒంటిపై బట్టలు కూడా అస్తవ్యస్తంగా వున్నాయి. నిశీకాంత్ భట్టాచార్య భోలానాథ్ గారిని అమ్మ ప్రవర్తనను విమర్శిస్తూ తీవ్రంగా నిందించసాగారు. అప్పుడు అమ్మ కనులు తెరచి అతనితో 'నా దుస్తులు సరిగా లేవని నాకు తెలుసు. అయితే నా మనసులో సిగ్గు, సంకోచం వంటి భావాలు కొంచెం గూడా కలగటం లేదు. అలాంటప్పుడు దుస్తులు ఎలా సరిచేసుకోగలను? అంటూ అతనివైపు తీవ్రంగా చూశారు. ఆ చూపుతో నిశీకాంత భట్టాచార్య భయంతో తీవ్రంగా వణికిపోయాడు. అప్పటి నుండి అమ్మను విమర్శించటం మానేశాడు.

ఆనందమయి అమ్మ ఎప్పుడూ నవ్వు ముఖంతో వుండేవారు. చిన్నప్పటి నుండి కూడా అందరూ ఆమెను 'ఆనందమ్మ' అనీ, 'ఆనందక్కా' అనీ పిలిచేవారు. అంతేకాదు, అమ్మ శరీరము దివ్యతేజస్సుతో మిలమిలా మెరిసిపోతుండేది. భోలానాథ్ గారి సహోద్యోగి భూదేవబాబు వీరింటి ప్రక్కనే వున్న యింట్లో నివసిస్తుండేవారు. ఆయన భార్య ఉష అమ్మపై ఎంతో భక్తి భావంతో వుండేవారు. ఆమె ఆశ్చర్యంగా అమ్మతో "అమ్మా! మీ శరీరం నుండి యింతటి కాంతి ఎలా వస్తోంది? నువ్వు కొండలలోకి, చీకటి లోయలలోకి, గుహలోకి వెళ్ళినా, నీ తేజస్సుతో ఆ ప్రాంతమంతా వెలుగులతో నిండిపోతుంది" అనేది.

1923 సం॥లో భోలానాథ్ గారిని ఉద్యోగం నుండి తొలగించటం జరిగింది. ఆయన వేరొక ఉద్యోగం కోసం అన్వేషించ సాగారు. క్రీ.శ. 1924 చైత్ర బహుళ త్రయోదశి నాడు ఉద్యోగార్థం అమ్మను వెంటబెట్టుకొని ఢాకా వెళ్ళారు. ఆ వూరిలో చాలా చోట్ల ఆయన ఉద్యోగం కోసం ప్రయత్నించినా ఫలితం శూన్యం. ఆయన నిరాశతో తిరిగి తమ ఊరు వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు ఆనందమయి అమ్మ "తిరిగి వెళ్ళిపోవలసిన అవసరం లేదు. ఇంకొక మూడు రోజులు ఓర్పుతో వేచిచూడండి" అన్నారు. సరిగా మూడు రోజులకు ఆయనకు ఉద్యోగం దొరికింది. వైశాఖ శుద్ధ చవితి నాడు ఢాకా లోని షాన్ బాగ్ నవాబు తోటలో 'తోట వ్యవస్థాపకులు' గా నియమింపబడ్డారు.

షాన్ బాగ్ విశాలమయిన తోట. ఆ తోటలోనే భోలానాథ్ గారి కుటుంబానికి నివాసగృహం యివ్వబడింది. ఆ రోజులలో అమ్మ ఎక్కువగా మౌనంలో వుండేవారు. ఆహార సంబంధమయిన నియమాలు కూడా పాటిస్తుండేవారు. 7,8 నెలల వరకు ఋతుధర్మం కూడా నిలచిపోతుండేది. చివరకు అమ్మకు 27-28 సం॥ల వయస్సులో ఋతుధర్మం శాశ్వతంగా నిలిచి పోయింది.

అమ్మ యింటి పనులన్నీ స్వయంగా చేసుకునేవారు. ఆ రోజుల్లో వీరింట్లో అమ్మ తమ్ముడైన మాఖన్, భోలానాథ్ గారి అన్న కుమారుడు 'ఆశు' వుండేవారు. వాళ్ళు ఢాకా పాఠశాలలో చదువుతుండేవారు. వారి కోసం అమ్మ ఉదయాన్నే వంట చేసేవారు. వాళ్ళు భోజనం చేసి పాఠశాలకు వెళ్లిన తర్వాత మరల స్నానం చేసి చెఱువు నుండి నీళ్ళు తెచ్చి, దేముడికి నివేదన కోసం మరల వంట చేసేవారు. వంటలో వేసే మసాలా పొడి విసరటం, దంచటం, కూరలు తరుగుకొనటం వంటి పనులన్నీ కూడా ఎవరి సహాయం లేకుండా ఒక్కరే చేసుకునేవారు. దేముడి పూజ, నైవేద్యం అయ్యాక భోలానాథ్ గారు భోజనం చేసేవారు. అమ్మ చాలా స్వల్పంగా భుజించేవారు. కొన్నాళ్ళు కేవలం పండ్లు మాత్రమే తీసుకునేవారు.

అప్పటికి, అంటే ఆ రోజులలో అమ్మ యొక్క దివ్యత్వం గురించి అందరికీ తెలియకపోయినా, ఆ ప్రాంతంలో కొందరికి అమ్మ మహనీయురాలు అనే విషయం తెలియటం వలన ఆమె దర్శనార్థం ప్రజలు రానారంభించారు. కొందరు తరచు అమ్మ వద్దకు రావటం, నిత్యమూ సత్సంగం చేసి వెళ్లటం జరిగేది.

**- సశేషం**

# "ధర్మో రక్షతి రక్షితః"

శ్రీ పి. సుధాకర రెడ్డి

**(విద్యానగర్ లో మాస్టరుగారి విద్యార్థులలో ఒకరిగా వుంటూ, వారి సాన్నిహిత్యాన్ని కోరి, వారికి చేరువై, ఆ తరువాత వారితో పాటు అదే కాలేజీలో హిస్టరీ లెక్చరర్ గా కలిసిమెలిసి ఉద్యోగం చేసిన వీరికి మాస్టరుగారితో వున్న అనుబంధంలో పొందిన దివ్యానుభవాలు ఎన్నో, ఎన్నెన్నో.)**

1969 వ సంత్సరములలో బి.ఎ. ఇంగ్లీషు లిటరేచర్ రెండవ సంత్సరము చదువుతున్నప్పుడు మాస్టరుగారు మాకు ఇంగ్లీష్ క్లాసెస్ కి వచ్చేవారు. హల్ తోషా అనే పోయమ్ వుండేది. దాన్ని ఆధ్యాత్మిక పరంగా చాలా బాగా ఎక్సుప్లెయిన్ చేస్తూ చెప్పేవారు. నాటి సంఘంలో వుండే ఫ్యాషన్స్ గురించి విమర్శించే వ్యాసం ఒకటి వుండేది. ఆ వ్యాసాన్ని చెప్తూ ఇప్పటి సంఘంలోని నిరుపయోగమైన ఫ్యాషన్స్ తో పోల్చితే ఎంతో విమర్శనాత్మకంగా మరెంతో ఇంట్రెస్టింగ్ గా చెప్పేవారు. ఆయన ఎలాంటి టాపిక్కైనా ఆధ్యాత్మిక పరంగా ఎంతో ప్రభోధాత్మకంగా చెప్పేవారు.

మొదటిసారి వారి రూము కెళ్ళినప్పుడు వారి టేబుల్ మీద రెండు ఫోటోలని చూశాను. ఒకటి సి.వి.వి. గారిది, రెండవది బాబాది. "మా నాన్నగారు సి. వి. వి. యోగం చేసేవారని" చెప్తూ నన్ను నేను పరిచయం చేసుకున్నాను. అలా ఆయన్తో ఏర్పడిన పరిచయాన్ని పెంచుకొని నాకొచ్చే డౌట్స్ ని తీర్చుకోవడానికి ఆయన రూము తరచుగా వెళ్తూండేవాడిని. వారితో పరిచయం పెరిగే కొద్దీ యింకా యింకా దగ్గరవ్వాలని ఆయనతో గడపాలని అన్పించేది. అప్పటికి వారికింత శిష్య బృందం వుండేది కాదు. నాకు ట్యూషన్ చెప్పమని అడిగాను. "నాకలాంటి అలవాటు లేదు. ఇంకెక్కడన్నా చేరు" అన్నారు. "నేను ఇంకెక్కడికీ వెళ్ళను" అన్నాను. "కావాలంటే కొన్ని ఎస్సేస్ ఇస్తాను. చదువుకో అంతే గాని ట్యూషన్ చెప్పను" అన్నారు. (1969 - 70) ఒక సంవత్సరమంతా నేను మాస్టరుగారు కలసి ఒక పోర్షన్లో, రాధాకృష్ణ మూర్తిగారు రెండవ పోర్షన్ లో వుండేవారం. మాస్టరుగారు నన్ను స్వంత సోదరునిలా ఎంతో అభిమానంగా చూసుకోనేవారు. టైముకి నిద్రలేవకపోతే నిద్రలేపేవారు. మేం దగ్గర్లోవున్న సుబ్బమ్మ మెస్ లో భోజనం చేసేవాళ్ళం. నేను స్టూడెంట్‌గా వున్నప్పుడు ఎక్కువగా మాట్లాడేవాణ్ణి కాదు. నాకు 1973 లో ఇక్కడే మా కాలేజీలోనే హిస్టరీ లెక్చరర్ గా వుద్యోగం వచ్చింది. నాకు జాబ్ చెయ్యాలంటే ఎంతో బెరుకుగా వుండేదని మాస్టరుగారికి చెప్తే, ఆయన రాధాకృష్ణగారికి చెప్పి హోమియో మందిప్పిస్తే ఆ భయం తగ్గిపోయి నా డ్యూటీ నిర్భయంగా చేయగల్గాను. 1974 లో నాకు పెళ్ళైంది.

రాధాకృష్ణగారికి భీమవరం



కాలేజ్ లో లెక్చరర్ గా జాబు వస్తే వారు వెళ్ళిపోయారు. వారు ఖాళీ చేసిన పోర్షన్ లో అంటే మాస్టరుగారి ప్రక్క పోర్షన్ లో నేను ప్రవేశించాను. మాస్టరుగారికి 1975 లో వివాహం జరిగింది. నేను ఆ పోర్షన్ ఖాళీ చేసి ఆ యింటికి ప్రక్కగా వున్న వేరే యింట్లో చేరాను. మాస్టరుగారు ఆ యింటి మొత్తాన్ని తీసుకున్నారు. అలా మాస్టరుగారికి చేరువగా వుండే అవకాశం లభించటం నా అదృష్టం.

మాస్టరుగారింట్లో సత్సంగాలు మొదలయ్యాయి. మొదట్లో స్టూడెంట్స్ ఎక్కువగా వచ్చేవారు. ఆ తర్వాత వారి పేరెంట్స్, ఆ తర్వాత స్థానికులు, చుట్టు ప్రక్కల వూళ్ళ నుంచీ కూడా ఎంతో మంది రావటంతో సత్సంగాలకు వచ్చేవారి సంఖ్య పెరిగింది. తర్వాత సాయిబాబా మిషన్ ఏర్పడింది. అందులో నాకు వైస్ ప్రెసిడెంట్ పదవినిచ్చారు మాస్టరుగారు. కాలక్రమేణా మాస్టరుగారి అనుచర వర్గం పెరిగింది. వారి కార్యక్రమాలు పెరిగాయి. వారి కెంతో పేరు ప్రఖ్యాతులు రావటం మొదలైంది. వారు హేతువాదుల దృష్టిలో పడ్డారు. వారితో వాదోపవాదాలు జరిగాయి.

నాకేమన్నా వ్యక్తిగత సమస్యలొస్తే సలహా సంప్రదింపులకు మాస్టరుగారి దగ్గర కెళ్ళేవాడిని. ఎంతో చక్కగా సలహాలిచ్చేవారు. నా పెళ్ళి విషయంలో ఆయనను సలహా అడిగితే ముందు నేనే స్వంత నిర్ణయం తీసుకొంటే బాగుంటుందని అన్నారు.

కానీ నేను మరీ మరీ అడిగితే “నేను పూజలో కూర్చుని చెప్తాను. కానీ చెప్పింది చెయ్యకపోతే కొన్ని యిబ్బందులేర్పడతాయి” అని అన్నారు. దాంతో నేను చేయగలనా? లేదా? అని మధనపడి “వద్దులెండి సార్” అని నా ఇష్ట ప్రకారమే పెళ్ళి చేసుకున్నాను. నా భార్యను బాబా చరిత్ర చదవమనేవారు. భక్తి వుంటే మంచి సంతానం కల్గుతుందనేవారు. వారిలో భక్తి బీజాలు అప్పట్నించే పడతాయి అని అనేవారు. మా అబ్బాయి పుట్టిన తర్వాత 2, 3, రోజులకు కుడికాలు నీలంగా అయ్యేది. ఒక్కోసారి నెల్లూరు, మద్రాస్ తీసుకెళ్ళి అక్కడి పెద్ద డాక్టర్స్ కి చూపించమన్నారు. అప్పడప్పుడు అలా వస్తూండేది. మళ్ళీ దానంతట అదే తగ్గిపోయేది. మాస్టరుగారికి చెప్తే ఆ కాలికి కొబ్బరినూనె స్వయంగా పూసి కాపటం పెట్టారు. అప్పుడు వెంటనే తగ్గి మళ్ళీ యింత వరకూ రాలేదు. మాస్టరుగారి దగ్గర మాకెంతో ప్రశాంతంగా వుండేది. వారి అండ మాకుందని కొండంత ధైర్యంగా వుండేది. అన్నీ ఆయనకు చెప్పకోవాలని అన్పించేది. చెప్పినవన్నీ ఓర్పుగా విని సమాధానాలు, పరిష్కారాలు చెప్పేవారు. మాకోసం ఆయన తన విలువైన కాలాన్నెంతగానో వినియోగించారు.

ఎవరైనా విద్యార్థినీ, విద్యార్థులు మరీ ఫ్యాషన్‌గా వుంటే దాని వల్ల ఏమి ప్రయోజనం లేదు అని అవతలవారికి తెలిసేలా చాలా సున్నితంగా, తమాషాగా విమర్శించేవారు. ఎవర్నైనా గట్టిగా తిట్టిన సందర్భాలు లేవు. అల్లరి పిల్లలెవరైనా చిలిపిగా గొడవ చేస్తుంటే వారి పై జోక్స్ వేస్తూ అరికట్టేవారే గాని సీరియస్ గా తిట్టేవారు కాదు. ఎవరన్నా చెడిపోతున్నా పాడైపోతున్నా “ఇలా వుంటే దెబ్బతినాల్సొస్తుంది ముందు ముందు ” అని కఠినంగా, గట్టిగా నిర్మొహ మాటంగా చెప్పేవారు.

వారెప్పుడూ బాబాని ధ్యానించాలి, నామానికి రూపాన్ని జోడించి ధ్యానించాలని చెప్పేవారు. సగుణోపాసనే గాక నిర్గుణోపాసన గురించి కూడా చెప్పేవారు. ప్రతిదానిలో శక్తి వుంటుంది. బాబా సర్వవ్యాపి. అలా వున్నారని నిరూపించారు కూడా. అందుకనే

ఆయన్ని ధ్యానించమని చెప్పేవారు. 'నేను' గురించి ధ్యానం చేయమనేవారు. సగుణోపాసన, నిర్గుణోపాసన వీటిలో ఏది గొప్పది? అని అడిగితే, "ఇందులో ఎక్కువ తక్కువ అన్న ప్రశ్నే లేదు. వారి వారి తత్వాన్ని బట్టి స్థాయిని బట్టి ఇష్టాయిష్టాలుంటాయి. ఎక్కువ తక్కువల ప్రశ్నే లేదు" అని చెప్పేవారు.

కొన్ని కొన్ని కలలు సాధనలో మీ స్థాయిని,స్థితిని సూచిస్తాయి.అందువల్ల కలల్ని డైరీలో వ్రాసుకోమనేవారు.

నేను, మాస్టరుగారు కలసి శ్రీశైలం పూర్ణానందస్వామి దగ్గర కెళ్ళాము. దాదాపు 1 గంట ధ్యానంలో కూర్చున్నారు. నేను బయట కూర్చున్నాను. "మీరిద్దరే ధ్యానంలో కూర్చున్నారు, మరి నా సంగతేం చేశారండి. అని అడుగుతున్నాడు" అని మాస్టరుగారు స్వామితో అంటే, "రా బాబు! ఇట్లా కూర్చో" అని పిలిచారు. మళ్ళీ మేము ముగ్గురం ఒక అయిదు నిముషాలు ధ్యానంలో కూర్చున్నాము. "ఇది తర్వాత నీ జీవితంలో వుపయోగపడ్తుంది" అని స్వామి అన్నారు. ఆశ్రమంలో నా చెప్పులు పోయాయి. తర్వాత స్వామి వారి ఆశీస్సులు తీసుకొని అక్కడ నుండి పాలధార, పంచధారకు బయలు దేరాము. కాళ్ళకు చెప్పులు లేవు. తీవ్రమైన ఎండ వేడికి కాళ్ళు మాడిపోతున్నాయి. అలాగే నడుచుకుంటూ పాలధార పోయేసరికి కాళ్ళు బొబ్బలెక్కాయి. చితికి పుండ్లు పడ్డాయి కూడా. నేను బాధతో, "ఇంక నేను నడవలేను మాస్టరు గారు" అన్నాను. అప్పుడు మాస్టరుగారు కూడా "నా స్థితీ అలానే వుంది. అయితే నువ్వు చెప్తున్నావు, నేను చెప్పటం లేదు. అదే తేడా" అన్నారు. వారి పాదాలు చూడగా ఎర్రగా కందివున్నాయి. నాకెంతో బాధ వేసింది.

మాస్టరుగారు మమ్మల్ని యితర మహాత్ముల దగ్గరక్కూడా పంపేవారు. చివటం అమ్మ దగ్గరకు పోతే అమ్మగారు ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడారు. రంగన్న బాబుగారిని, వెంకయ్యస్వామివారిని దర్శించాము. కాళహస్తిలో గోపాలస్వామి అవధూత మమ్మల్ని మాత్రం రమ్మని అందరినీ పంపేశారు.

మాస్టరుగారు పగలు నిద్రపోయేవారు కాదు. నేనేమో నిద్ర పోయేవాణ్ణి. ఒక్కొక్క సారి "పగటి నిద్ర మంచిది కాదు" అని గట్టిగా చెప్పేవారు. యోగాసనాలు ఆరోగ్యానికి ఎంతో అవసరం. ఇవి ఒక గురువు దగ్గర నేర్చుకోవాలే గాని ఎవరంతట వారు ఇష్టం వచ్చినట్లు వేయకూడదనీ ధ్యానంలో ఏకాగ్రత కుదరటానికి ముద్రలు అవసరమనీ, ఎంతగానో వుపయోగపడ్తాయనీ, ఎప్పుడూ బాబా మన దగ్గరే వున్నట్లు భావించటం మంచిదనీ చెప్పేవారు. ఆయన ఎవరూ లేనప్పుడు చీరాల స్వామి యిచ్చిన నైలాన్ చీరె పైన వేసుకొని ధ్యానం చేసుకునేవారు.

వారు సైంటిఫిక్ బుక్స్ ఎక్కువగా చదువుతూండే వారు. సత్సంగములో బుద్ధిజం, జైనిజం సంప్రదాయాలలోని గురువుల గురించి బుక్స్ ని చదివేవారు. ఆయన చాలా స్పీడ్ గా చదివేవారు. చదివేటప్పుడు, అండర్ లైన్ చేస్తూ చదివేవారు. ఆ అండర్ లైన్ చేసినవి, చదువుకుంటూ పోతే మనకు పుస్తకం పూర్తిగా చదవాల్సిన అవసరం లేకుండా పూర్తిగా విషయం అర్ధం అవుతుంది. మన కాలం వృధాకాదు. వారికి జ్ఞాపక శక్తి చాలా బాగుండేది. ఏదన్నా విషయం చెప్తూ ఎన్నెన్నో విశేషాలను ఫలానా బుక్ లో ఇలా వుంది ఫలానా బుక్ లో అలా వుందని చెప్తూండేవారు.

కాకబలికై మనం తినేముందు రెండు ముద్దలు బయట పెట్టాలి. "మన తినే ప్రతి ముద్దా దేముడిచ్చిందే కదా! అనే కృతజ్ఞతా భావంతో తినాలి" అని చెప్పేవారు. ఒక్కోసారి నన్ను "ఏం గురువుగారు" అని తమాషాగా పిలుస్తూ "తప్పించుకు తిరుగువాడు ధన్యుడు" అని అంటూండేవారు. కొన్ని విషమ పరిస్థితులలో అక్కడ్నుంచి ఒంగోలు కెళ్ళిపోయారు. ఆయనకేం మహరాజ్ ఎక్కడకు రమ్మంటే అక్కడికెళ్లారు. ఒంగోలు గడ్డ ఏం పుణ్యం చేసుకుందో గాని తిరిగి తిరిగి వారు చివరకు ఒంగోల్లో స్థిరపడ్డారు. ఒంగోల్లో శరత్ బాబు చేత స్కూల్ పెట్టించారు.

మాస్టరుగారు ఒంగోలు వెళ్ళడంతో మాస్టారు గారితో సంబంధాలు తగ్గిపోయాయి. "అంతా దేవుడు చేస్తాడులే అని కాకుండా అధర్మాన్ని ఎదుర్కోవాలి, ప్రతిఘటించాలి" అని చెప్పేవారు. "మనకెందుకు సార్ లేనిపోనిది" అని అంటే వూరుకునేవారు కాదు. ఇంకా కొన్ని నెలల్లో సమాధి అవుతారనగా ఒంగోలుకు స్పాట్ వాల్యూయేషన్ కి వెళ్ళినప్పుడు మాస్టారు గారింటికి వెళ్ళాం. మాస్టారుగారెంతో అభిమానంగా ఆ రాత్రి అక్కడ ఉండమంటే ఉన్నాం. అదే ఆయనను కడసారి చూడటం.●

# సపత్నేకర్

**_పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ_**

మహదేవ్ వామన్ సపత్నేకర్ అక్కల్కోటలో న్యాయవాదిగా వుండేవాడు. అతడి తల్లిదండ్రులు మాధేగావ్ లో నివసిస్తుండేవారు. మహదేవ్ తండ్రి దినకర్ సపత్నేకర్ స్వతహాగా సపత్నే గ్రామానికి చెందినవాడు. ఒకప్పుడు ఆ కుటుంబం మాధేగావ్ లో స్థిరపడి అందరూ న్యాయవాదులయ్యారు. దినకర్ సపత్నేకర్ మొదట దత్తాత్రేయుని భక్తుడు. అతడు తరచుగా గాణాపూర్ వెళ్ళి వస్తుండేవాడు. ఒకప్పుడు ఆ క్షేత్రంలోనే అతని భార్య, కొడుకు మరణించడం చేత ఆ శోకం భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని నదిలోకి దూకాడు. కాని చిత్రమైన రీతిన దత్తస్వామియే అతనిని రక్షించి, అక్కల్కోటలోని శ్రీ స్వామి సమర్థను ఆశ్రయించమని చెప్పారు. అందుకే అటుతర్వాత శ్రీ స్వామి సమర్థుల మరొక రూపమైన శ్రీసాయిబాబా అతని కొడుకు మహదేవ్ వామన్ సపత్నేకర్ ను గూడ తమ చెంతకు చేర్చుకొన్నారు. సద్గురు సేవ తరతరాలు కాపాడుతుంది.

మహదేవ్ వామన్ సపత్నేకర్ న్యాయవాదిగా అక్కల్కోటలో నివసిస్తూండేవాడు. అతనికి 33వ ఏట భార్య, ఒక కుమారుడు చనిపోవడం వలన మానసికంగా అతడెంతో కృంగిపోయాడు. బంధువుల, స్నేహితుల ప్రోద్బలంతోను, వంశం నిలబడాలన్న సంకల్పంతోనూ అతను రెండవసారి వివాహం చేసుకున్నాడు. కాని ఆ తర్వాత 4 సం॥ల వరకు అతనికి బిడ్డలు కలుగనేలేదు. అంతటితో అతడు మళ్ళీ చిగురిస్తుందని ఆశించిన జీవితం మోడు అయిపోయినట్లనిపించింది. జీవితంపై అతడు పెట్టుకున్న కొద్ది ఆశలూ అడియాసలయ్యాయి. సం॥ 1913లో శ్రీ సాయిబాబాను దర్శిస్తే అతడి కోరిక నెరవేరగలదని అతని మామగారు సలహా యిచ్చారు. నిజానికి అతడు సాయి గురించి అంతకుముందే విన్నాడు కాని అతనికి అప్పట్లో ఎట్టి నమ్మకాలూ లేవు. అందువలన అతడు బాబాగురించి శ్రద్ధ వహించలేదు సరిగదా, వారిగురించి తనకు తెలిపిన సహపాఠి షేవడేను గూడ ఎగతాళి చేసి, సాయి గురించిగూడ చులకనగా మాట్లాడాడు. సం॥ 1913లో మరలా తమ మామగారు చెప్పినప్పుడుగూడ అతనికి విశ్వాసం కలుగలేదు. కాని అతని తండ్రి గూడ సాయిని దర్శించమని చెప్పారు. ఆ రోజులలో తండ్రి మాట కాదనగల కొడుకులెవరు? కేవలం ఆయన మాట త్రోసిపుచ్చలేక మాత్రమే తన తమ్ముడు పండితరావుతో కలసి అతడుగూడ శిరిడీ వెళ్ళాడు. అప్పటినుండి ఆ దంపతులకు సాయితోగల అనుభవాలు శ్రీమతి పార్వతీబాయి సపత్నేకర్ యిలా చెప్పింది : “మావారు మొదటిసారి శిరిడీ వెళ్ళినపుడు నమస్కారం చేయడానికి సాయిని సమీపిస్తుంటే ఆయన మావారిని చూచి, “ఫో, బయటకు!” అని గర్జించి తోసివేసారు. ఆ వేగానికి మావారి తలపాగ దూరంగా పడింది. ఆయన ఖిన్నుడై రెండు మూడు రోజులు శిరిడీలోవున్నా బాబా ప్రసన్నులు కాలేదు. ఆయన నిరుత్సాహంతో తిరిగివచ్చి, తమను శిరిడీ పంపి, కించపరచినందుకు వారి తండ్రిపై కోపించాడు. అపుడు మావారు నన్ను మాధేగాంవ్ లో అత్తగారింట్లో విడిచి శిరిడీ వెళ్ళారు. నాకుగూడ ఎంతగానో వెళ్ళాలనిపించిందిగాని ఆ రోజులలో ఏ ఇల్లాలూ భర్త నిర్ణయానికి ఎదురు చెప్పేదిగాదు.

తర్వాత ఒకరోజు నాకు స్వప్నంలో మెరుపు మెరిసినట్లైంది. అపుడు మా గ్రామంలో నీటి కొరత వుండేది. అపుడు మాయింట్లో ఒక చుక్కైనా నీరులేదని గుర్తొచ్చి (కలలోనే) బిందె తీసుకుని దగ్గరలోవున్న బావి దగ్గరకు బయల్దేరాను. ఆ కాలంలో ఇంటి కోడలు వంటరిగా ఇల్లు విడిచి వెళ్ళకూడదనేవారు, కనుక మా మామగారు కోర్టునుండి

వచ్చేలోగా తిరిగి ఇల్లు చేరాలని నేను త్వరత్వరగా వెళ్తున్నాను, నేను బావిని సమీపిస్తుండగా తలకు గుడ్డ చుట్టుకున్న ఫకీరొకరు అక్కడ నిలబడి వున్నారు. ఆయన నావైపుగా వచ్చి, 'అమ్మాయి! ఎందుకనవసరంగా శ్రమపడతావు? నేనే నీ బిందె శుభ్రమైన నీటితో నింపి తెచ్చి పెడతాను' అన్నారు. నేనాయన భావాన్ని శంకించి భయపడ్డాను. నా ఎదుటే ఆయన కఫ్నీ పైకెత్తి మూత్ర విసర్జనకు కూర్చొనడంతో నా అనుమానం దృఢపడి, మాయింటి వైపు పరిగెత్తాను. ఆయన నావెంటనే వస్తూ, "పారిపోవద్దు. తర్వాత పశ్చాత్తాపపడతావు. నీకొకటిద్దామని వచ్చాను" అంటున్నారు. నేను ఇల్లు చేరి తలుపు బిడాయించుకున్నాను. ఆ ఫకీరు గూడా తలుపువద్దకొచ్చి, తలుపు సందులలో నుండి గులకరాళ్ళు లోపలికి విసురుతూ, 'నేను నీకొకటి యిద్దామని వచ్చాను' అని మళ్ళీ మళ్ళీ అంటున్నారు. దిక్కుతోచక నేను కేకలు పెడదామనుకుంటుండగా కల అంతరించి నిద్ర మెలకువ వచ్చింది.

తెల్లవారి నా కల గురించి మా అత్తగారికి చెబుతున్నపుడు మా మామగారు విని మావారితో, 'నీ భార్యకు శిరిడీ దర్శించాలని వుండడం వలన ఈ కల వచ్చియుండవచ్చు. ఆమెను తీసుకొని మరొక్కసారి శిరిడీ వెళ్ళు' అన్నారు. నా భర్త చికాకుగా, 'దాని మాటలు పట్టించుకొనేదేమిటి? దానికలా అనిపించడం వల్లనే కల వచ్చింది, నేను మళ్ళీ శిరిడీ వెళ్ళి బాబానుండి న్యూనత పొందడం నా కిష్టం లేదు!' అన్నారు. కానీ మా మామగారు ఆయనను శాంతపరచి (మగ సంతతిలేని) వాళ్ళ వదినగారినిగూడ తీసుకెళ్ళమన్నారు.

ఆ ప్రకారమే మేము బయల్దేరి శిరిడీ చేరే సమయానికి శ్రీ సాయిబాబా లెండీ బాగ్ నుండి తిరిగి వస్తున్నారు. ఆయనను చూస్తూనే నేను నివ్వెరబోయాను! నాకు కలలో కనుపించిన ఫకీరు వారే! నన్ను చూస్తూనే ఆయన తమ పొట్ట నిమురుకుంటూ, 'తల్లీ నా కడుపులో ఎంత నొప్పిగా వుందో! నా నడుము గూడ నొప్పి పుడుతోంది!' అన్నారు. నాకేమీ అర్థంగాక, ఆయన కేమైందోనని తెలుసుకోవాలనుకున్నాను. వారి భక్తులెవరైనా బాధ పడుతుంటే వారి బాధ నివారించేటప్పుడు ఆయన అలా అంటుంటారని నా సాటి భక్తులు చెప్పారు. ఆయనెంత చక్కగా నటించగలరో చూస్తే నవ్వొచ్చింది. నాకపుడర్థం గాలేదు గాని, కొద్దికాలం తర్వాత నాకటువంటి నొప్పులే వచ్చి, వాటికవే తగ్గిపోవడంతో ఆయన నాతోనే అలా ఎందుకన్నారో అర్థమై, వారిపట్ల భక్తి, కృతజ్ఞత కలిగాయి. కొద్దిసేపట్లో బాబా మశీదు చేరాక మేము పూవులు, నైవేద్యమూ తీసుకొని ముందు నా భర్త, ఆయన వెనుక నేనూ వారి దర్శనానికి వెళ్ళాము. మావారు ఆయనను సమీపించగానే బాబా అంతకుముందులాగానే, 'ఫో బయటకు' అని గద్దించారు. కాని నన్ను మాత్రం తమను సమీపించి పాద నమస్కారం చేసుకోనిచ్చారు. పట్టలేని సంతోషంతో నన్ను నేనే మరచాను. బాబా తమ పిడికిలినిండా ఊదీ తీసుకొని 'ఇదిగో, తీసుకో! ఒకటి, రెండు, మూడు, నాలుగు, నీకెందరు కావాలి?' అన్నారు. ప్రతివారికీ బాబా ఆశీస్సులు లభిస్తున్నాయి గాని, మావారికి మాత్రం 'ఫో బయటికి!' అన్నమాటే లభించిందని మావారు బాధపడ్డారు. ఆయన కొంచెం ఆలోచించుకున్నాక, గతంలో వారు బాబాను శంకించి, వారిపై అపోహపడడం వల్లనే తనకలా జరుగుతోందని తోచింది. ఏమైనా సరే, బాబా ఆశీస్సులు పొందాకగాని శిరిడీ విడిచి వెళ్ళకూడదని వారు నిశ్చయించుకున్నారు. కొద్దిరోజులలోనే వారికట్టి అవకాశమొచ్చింది.

ఒకరోజు బాబా ఒక్కరే మశీదు ముంగిటవున్న రాతిపై కూర్చొని వుండగా చూచి పరుగున సమీపించి, వారి పాదాలు గట్టిగా పట్టుకొని మావారు కన్నీరు పెట్టుకున్నారు. వారి తలపై బాబా చేయిపెట్టి ఆశీర్వదించి, తమచెంతన కూర్చోబెట్టుకున్నారు. ఇంతలో గొర్రెల కాపరి ఒకామె వచ్చి తన అలవాటు ప్రకారం బాబా పాదాలు వత్తనారంభించింది. బాబా ఆమెతో మాట్లాడుతున్నారు. వారు చెప్పేదంతా తన గురించేనని మావారు గుర్తించి ఆశ్చర్యపోయారు. 'తన కొడుకును చంపానని ఈ పెద్దమనిషి అంటున్నాడు. నేను ఎవరి బిడ్డలనైనా చంపుతానా? సరే. నేనిప్పుడే ఆ బిడ్డను ఇతని భార్య గర్భంలో వుంచుతాను', అన్నారు. మావారెంతగానో సంతోషించి తిరిగి తిరిగి బాబాకు నమస్కరించి మావద్దకొచ్చేసారు. జరిగినదంతా మాతో చెప్పి, నన్ను ఆరతికి వెళ్ళడానికి త్వరగా సిద్ధంకమ్మన్నారు. నైవేద్యానికి పూర్ణంపోళీలు సిద్ధం చేయమని నాతో చెప్పారు. కాని హల్వా తయారు చేయమని బాబా సేవకుడు చెప్పాడు. ఆరతి అవగానే భక్తులందరమూ పళ్ళాలలోని నైవేద్యం బాబా ముందుంచాము. మాపళ్ళెం అన్నిటికంటే చివరన వున్నది. అయినప్పటికీ బాబా ప్రత్యేకంగా ముందుకువంగి, మా పళ్ళెంలోని హల్వామాత్రమే తీసుకొని ఆరగించారు! మేమెంతో సంతోషించాము.•

# మహాయోగి శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రి గారు

(ఆగస్టు సంచిక తరువాయి)

**శ్రీమతి శ్రీదేవి**

కోటయ్య శాస్త్రిగారితో సంపన్నుడైన నారాయణ, "మహానుభావా! తమరెవ్వరో నాకు తెలీదు. సమయానికి ఏతెంచి ప్రాణదానం చేసిన నా పాలిట దైవం మీరే! మీ ఋణం తీర్చుకోలేనిది. అయినా, ఉడుతాభక్తిగా మీకోసం ఏదో ఒకటి చేయాలనిపిస్తున్నది. చెప్పండి మీకోసం నేను ఏమి చేయగలను? ఏది కావాలంటే దానిని సమర్పించుకొంటాను. ఎంత డబ్బు కావాలన్నా యిస్తాను. దయతో స్వీకరించవలసింది" అంటూ ప్రాధేయపడ్డాడు.

అత్యంత నిర్లిప్తుడైన శాస్త్రిగారు తనకేమీ వద్దనీ, తనకు కాశీయాత్ర వెళ్ళటానికి తగిన ఏర్పాట్లు సమకూరిస్తే అదే చాలనీ అన్నారు. నారాయణ ఆశ్చర్యపోయాడు. 'ఈయన వైద్యుడు కాడు. మానవులను తరింపజేసేందుకు దిగి వచ్చిన భవరోగ వైద్యుడు. ఎన్నలేనంత ధనం ధారపోస్తానన్నా సున్నితంగా తిరస్కరించిన యితని వైరాగ్యం సాటిలేనిది' అనుకున్నాడు నారాయణ.

కోటయ్య శాస్త్రిగారి కోరికమేరకు ఆయన కాశీ క్షేత్రానికి వెళ్లేందుకు సకల ఏర్పాట్లు గావించాడు నారాయణ. కోటయ్య శాస్త్రిగారు కాశీ క్షేత్రం చేరుకున్నారు. మనసులో దైవచింతన తప్ప ఆయనకు మరొక ఆలోచన లేదు. ఇల్లు, భార్య, తల్లిదండ్రులు గురించిన తలంపే రాదు. దైవధ్యాసయే శ్వాసగా మారిపోయింది. ఉదయాన్నే గంగాస్నానం చేసి విశ్వేశ్వర దర్శనం చేసుకొని గంగానదీ తీరాన యిసుక తిన్నెలపై కూర్చుని కనులు మూసుకుని గంటల తరబడి ధ్యానంలో గడపటం, ఆకలి వేసినప్పుడు భిక్షాన్నంతో కడుపు నింపుకొనటం – ఇది అతని దినచర్య!

ఇలా కొన్ని నెలలు గడిచాయి.

ఒకరోజు ఒక చిత్రమైన సంఘటన జరిగింది. గంగాతీరాన కనులు మూసుకుని ధ్యానస్థుడై వున్న కోటయ్య శాస్త్రిగారి మనోనేత్రానికి కాషాయాంబరధారి, దివ్యతేజస్సుతో వెలిగిపోతున్న ఒక యతీశ్వరుడు దర్శనమిచ్చారు. ఆ దర్శనంతో దిగ్భ్రాంతి చెందిన కోటయ్య శాస్త్రిగారు ఒక్కసారిగా కనులు తెరచి చూశారు. కళ్ళ ఎదురుగా గంగాస్నానం చేసి వస్తున్న ఆ యతీశ్వరుడు చిరునవ్వుతో తనను చూస్తూ తనను సమీపిస్తున్నారు. శాస్త్రిగారు పరుగున వెళ్ళి ఆ స్వామి పాదాలపై వాలిపోయాడు. ఆ యతీశ్వరుడే శ్రీశ్రీశ్రీ బాల సరస్వతి స్వామివారు.

శ్రీ బాల సరస్వతి స్వామివారు గొప్ప తపస్సంపన్నులు. శ్రీ లలితా మహాదేవి సాక్షాత్కారాన్ని పొంది, ఆ దేవి ఆదేశంతో సద్గురువై జనులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తున్న గొప్ప మహాత్ముడు. మహిమాన్వితుడైన ఆ స్వామి దర్శనంతో పులకించిపోయారు శాస్త్రిగారు. కరుణామయుడైన ఆ స్వామి శాస్త్రిగారిని తన ఆశ్రమానికి

తోడ్కొని వెళ్ళారు. ఆయనను తన శిష్యునిగా స్వీకరించారు.

ఆశ్రమవాసియై గురుసేవ చేస్తూ తపోనిష్ఠలో కాలం గడుపుతూ వుండగా అతని తపస్సు ఫలించిందా అన్నట్లు కోటయ్య శాస్త్రిగారిపై గురుదేవుల అనుగ్రహం, కృప వర్షించింది.

ఒక శుభదినాన శుభముహూర్తాన శ్రీ స్వామివారు శాస్త్రిగారికి శాస్త్రోక్తముగా శ్రీ త్రిపురసుందరీ మహామంత్రోపదేశం చేసి దీక్షనిచ్చారు. గురుదేవుల పర్యవేక్షణలో చాలాకాలం మంత్రానుష్ఠానము చేసిన శాస్త్రిగారు మంత్రసిద్ధిని, యోగసిద్ధిని పొందారు. అటు తర్వాత కూడా శాస్త్రిగారు స్వామివారి ఆశ్రమంలోనే తన అనుష్ఠానాన్ని కొంతకాలం కొనసాగించారు. అలా ఉండగా ఒకరోజు శ్రీ బాలసరస్వతి స్వామివారు శాస్త్రిగారితో, "నీవు యోగసిద్ధిని పొందావు. ఇక యింటికి తిరిగి వెళ్ళి ఆదర్శ గృహస్థ జీవితం గడపవలసి వున్నది. స్వధర్మాన్ని ఆచరిస్తూ తపోసాధనలతో జీవితాన్ని చరితార్థం చేసుకో. నీకు లలితాదేవి అనుగ్రహము ఎల్లప్పుడూ ఉంటుంది. నీకు శుభమగును గాక!" అని ఆశీర్వదించారు. గురుదేవుల ఆదేశంతో వారివద్ద సెలవు గైకొని స్వగృహం చేరుకున్నారు శాస్త్రిగారు

జీవనోపాధికై యిల్లు విడచి వెళ్ళిన కుమారుడు ఎంతకాలానికి తిరిగి రాకపోవటంతో కలత చెందిన తల్లిదండ్రులు అతని జాడ తెలుసుకొనటానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కానీ ఫలితం శూన్యం. ఒక్కగానొక్క కొడుకు వియోగంతో జీవచ్ఛవాలుగా బ్రతుకుతున్న తల్లిదండ్రులు, కన్నీటితో కాలం గడుపుతున్న భార్య, ఉన్నట్లుండి ఒకనాడు కనుల ఎదుట ప్రత్యక్షమైన శాస్త్రిగారిని చూసి ఎంతో ఆనందించారు. అయితే వారి కళ్లకు శాస్త్రిగారు ఎంతో వినూత్న పోకడతో దర్శనమిచ్చారు. ఆయన మునుపటి శాస్త్రిగారు కాదు. తపోనిష్ఠతో వెలిగిపోతున్న ముఖకాంతులు, దివ్యత్వం వెదజల్లుతున్న దేహవర్చస్సు వారిని దిగ్భ్రాంతులను చేశాయి. 'ఏమిటీ విచిత్రం! ఎక్కడిదీ తేజస్సు?'- వారికేమీ అర్థంకాలేదు. కానీ ఆయన తపోనిష్ఠ, నడవడిక వారి సందేహాలను తొలగించాయి. కాశీలో జరిగిన సంఘటనలను శాస్త్రిగారి ద్వారా విని తెలుసుకున్న కుటుంబ సభ్యులకు సర్వం అవగతమైంది. ఇతడు అందరివలె సాధారణవ్యక్తి కాదని యోగపురుషుడు, కారణజన్ముడు అని భావించిన కుటుంబ సభ్యులు యికపై అతని తపోసాధనకు ఎటువంటి అభ్యంతరాలూ కలిగించకూడదని ధనసంపాదన విషయమై అతనిని ఎంత మాత్రము ఒత్తిడి చేయకూడదని నిర్ణయించుకున్నారు.

తన గురుదేవులు ఆదేశించిన విధముగా గృహస్థధర్మం ఆచరిస్తూ నిరంతర తపోసాధనలో కాలం గడపసాగారు శ్రీ కోటయ్య శాస్త్రిగారు.

కొంతకాలానికి ఆయనకు ఒక పుత్రుడు కలిగాడు. పుట్టిన బిడ్డ శాంతి నక్షత్రంలో జన్మించిన కారణంగా, నవగ్రహ శాంతి, బ్రాహ్మణ సంతర్పణ జరిపించవలసి ఉంటుందని పండితులు చెప్పటంతో అందుకు తగిన శుభముహూర్తం నిర్ణయింపబడింది. కానీ ఆ క్రతువు జరిపించేందుకు అవసరమైన ధనం కోటయ్య శాస్త్రిగారి వద్ద లేదు. కార్యక్రమం ఎలా జరిపించాలా అని కుటుంబ సభ్యులు ఆందోళన చెందసాగారు. అయితే విచిత్రం ఏమిటంటే శాస్త్రిగారిలో మాత్రం ఎటువంటి ఆందోళన లేదు. పైగా ఆ పరిస్థితుల్లో ఆయన వైఖరి కుటుంబంలోని వారిని మరింత ఆందోళనకు గురిచేసింది. ఆయన ఊరిలోని ప్రతి ఇంటికి వెళ్లి తన ఇంట్లో జరిగే శాంతి, పూజాకార్యక్రమానికి, తాను యిచ్చే విందుకు తప్పక రావలసినదిగా ఆహ్వానించారు. తనను వారింప యత్నించిన తల్లిదండ్రులను, "అంతా అమ్మవారు చూసుకుంటుంది. ఏమీ భయపడవద్దు" అంటూ ఓదార్చారు శాస్త్రి గారు.

ముహూర్తం దగ్గర పడుతున్న కొద్దీ కోటయ్య శాస్త్రిగారి ఇంట్లోనివారు ఎంతో కంగారు పడసాగారు. అలా వుండగా సరిగ్గా కార్యక్రమం జరగటానికి ముందు రోజు ఉదయం శాస్త్రిగారి ఇంటికి కాకుమాను అనే సమీప గ్రామం నుండి మాజేటి శేషయ్య అనే వైశ్యుడు వచ్చాడు. అతడు శాస్త్రిగారితో యిలా అన్నాడు: "అయ్యా! నేను శ్రీ లలిత అమ్మవారిని నిత్యము అర్చిస్తూ వుంటాను. ఈనాటి నా భాగ్యం ఏమని చెప్పను! క్రిందటి రాత్రి నాకు ఆ దేవి స్వప్నదర్శనమిచ్చి, "చాగండ్ల గ్రామస్థుడైన కోటయ్య శాస్త్రి నా భక్తుడు. అతని ఇంట్లో జరిగే

నవగ్రహశాంతి పూజాకార్యక్రమానికి అవసరమైన సామాగ్రి, సరుకులు, ధనము అన్నింటినీ నీవు సమర్పించుకొనవలసివున్నది. వెంటనే ఆ పని నెరవేర్చు. నీకు శుభమగు గాక!" అంటూ తన దివ్యాశీస్సుల ననుగ్రహించింది. దయతో నేను యిచ్చే ఈ కానుకలు స్వీకరించండి. అదిగో సంతర్పణకు కావలసిన సకల సామాగ్రితో వాకిట్లో ఎడ్లబండి వేచి వున్నది." శ్రీ కోటయ్య శాస్త్రిగారి కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతులైనారు. వాకిట్లోకి వెళ్లి చూస్తే వడ్డనకు అవసరమైన అరటిఆకులతో సహా సమస్త సామాగ్రితో నిండిన ఎడ్లబండి కనిపించింది. ఈ సంఘటనతో శ్రీ కోటయ్య శాస్త్రిగారిపై అమ్మవారి కరుణ ఎంతగా వున్నదో వారికి అర్థమయింది. నాటినుండి వారు శ్రీ శాస్త్రిగారి చర్యలకు ఎటువంటి ఆటంకము కలిగించేవారు కాదు. ఆయన గురించి ఆందోళన చెందేవారు కాదు. అంతటి దేవి అనుగ్రహపాత్రుడు తమకు పుత్రుడుగా జన్మించటం తమ పూర్వజన్మ సుకృతంగా భావించి ఎంతో ఆనందించేవారు.

ఈ వింత సంఘటన చాగండ్ల గ్రామమే కాక కాకుమాను మొదలైన చుట్టుప్రక్కల గ్రామాలన్నింటికీ పాకింది. శ్రీ కోటయ్య శాస్త్రిగారు గొప్ప యోగపురుషుడుగా ప్రజలంతా భావించసాగారు.

ఆ మర్నాడు కార్యక్రమానికి ఆహ్వానించిన వారికంటే ఎంతో ఎక్కువమంది జనం వచ్చారు. వండిన వంటలు వచ్చినవారికి సరిపడా లేవని వంటవారు ఆందోళన చెంది శాస్త్రిగారికి విషయం చెప్పారు. శ్రీ కోటయ్య శాస్త్రిగారు దేవిని స్మరించి అన్నపురాశికి కర్పూరహారతి నిచ్చారు. అమ్మవారికి వంటకాలు అన్నింటిని నివేదించారు. వంటకాలపై వస్త్రాన్ని కప్పి వడ్డన ప్రారంభించమని వంటవారిని ఆదేశించారు. ఎంతో ఆశ్చర్యం! వండిన పదార్థాలన్నీ అక్షయమై అందరూ భోజనాలు చేసిన తర్వాత కూడా పదార్థాలన్నీ మిగిలి ఉండటం అందరిని ఆశ్చర్యపరిచింది. ప్రజలెంతగా గౌరవించినా, కోటయ్య శాస్త్రిగారి వైఖరిలో మార్పు లేదు. ఎవరు గౌరవించినా, అగౌరవపరచినా పట్టించుకునేవారే కాదు. ఆయన మనసు అన్నింటికీ అతీతంగా ఎల్లప్పుడూ దైవచింతనలోనే నిమగ్నమై వుండేది.

భౌతిక సుఖాలకు, ఆడంబరాలకు ఆయన దూరంగా ఉండేవారు. అలాంటి వైభోగాలకు ఆయన మనసులో వీసమెత్తు విలువ కూడా లేదు. ఆయన జీవిత విధానం ఎంతో నిరాడంబరంగా వుండేది. ఒక సాధారణమైన లుంగీ, భుజంపై ఒక కండువా – ఇదీ ఆయన వస్త్రధారణ. ఎవరితోనైనా అవసరమైనంత వరకే మాట్లాడేవారు. ఎల్లప్పుడూ మౌనంగా దేవీ చింతనలో దేవీ పూజలో, ధ్యానంలో గడిపేవారు. ఊరిబయట ఒక పెద్ద ఏరు ప్రవహిస్తుండేది. ఆ ఏరులోని నీటి మధ్యలో ఒకచోట ఎత్తైన బండ రాళ్ళు వుండేవి. రాళ్ళతో వున్న ఆ ప్రదేశం సమతలంగా చదునుగా వుండేది. ఆ బండ రాళ్ళ మధ్యన ఎత్తైన ఏపుగా పెరిగిన వృక్షాలు కూడా వుండేవి. ఎంతో నిశ్శబ్దంగా ప్రశాంతంగా వుండే ఆ ప్రదేశానికి వెళ్ళి ఆ వృక్షాల నీడలో కూర్చుని ఏకాంతంగా ఎన్నో గంటలు ధ్యానమగ్నులై గడిపేవారు, శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రి గారు.

శ్రీ శాస్త్రిగారు ఎప్పుడూ జనంలోకి వచ్చేవారు కాదు. ఎప్పుడూ ఏకాంతంగా, మౌనంగా గడిపేవారు. ఆయన ఒక మహాత్ముడు అని గుర్తించిన ప్రజలు కొందరు ఆయనవద్ద నుండి ఉపదేశాలు తీసుకొనాలనే వుద్దేశంతో ఆయన వద్దకు వచ్చేవారు. కానీ ఆయన ఎవ్వరికీ ఎటువంటి మంత్రోపదేశాలు చేసేవారుకాదు. ఎన్నడూ ఎటువంటి ఉపన్యాసాలు, బోధలు చేసేవారు కాదు. ఆయనను దర్శించాలని వచ్చేవారికి ఆయన అందుబాటులో వుండేవారు కాదు. స్వగ్రామంలోనే కాక యితర గ్రామాల నుండి కూడా ప్రజలు ఆయనను తమ యిండ్లకు వచ్చి లలితా దేవీ పూజలు చేయవలసిందిగా ప్రార్థించేవారు. అటువంటి అభ్యర్థనను మాత్రం ఆయన త్రోసిపుచ్చక సంతోషంగా అంగీకరించేవారు. ఎంతో భక్తితో వారిండ్లలో దేవీ పూజలు నిర్వహించేవారు. ఆయన తమ గ్రామంలో అడుగు పెట్టడమే పరమ శుభప్రదంగా భావించి చుట్టుప్రక్కల గ్రామాల నుండి ఆయా గ్రామ పెద్దలు వచ్చి శ్రీకోటయ్య శాస్త్రిగారిని ప్రార్థించి వారి గ్రామాలకు తీసుకొని వెళ్ళేవారు.

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

*శ్రీమతి అన్నపూర్ణ, ఒంగోలు*

దాదాపు 30 సంవత్సరముల క్రితం, ఒకసారి మేము విజయవాడలో రోడ్డుమీద వెడుతుండగా, నా ముందర 3 సాయిబాబా చిన్న ఫోటోలు కింద పడివున్నాయి. అయ్యో! ఎవరో బాబా ఫోటోలు కింద పడేశారని తీసుకున్నాను. ఆ విధంగా నా దగ్గరకి బాబా వచ్చారు.

అయితే బాబా గురించి ఏ విషయాలు నాకు తెలియవు, అంటే హారతులు, చరిత్ర మొదలైన విషయాలు.,, తరవాత మావారి ఉద్యోగరీత్యా మేము కందుకూరులో ఉండేవాళ్ళం. అప్పుడు ఒకరోజు నాకు ఈ విధంగా ఒక స్వప్నం వచ్చింది:

మా అబ్బాయి చాలా చిన్న పిల్లవాడు. వాడు, నేను, నీళ్ళపైన నడుస్తున్నాం. అది చాలా పెద్ద సముద్రంలా వుంది. దాంట్లో ఎంతో దూరం కాళ్ళు నొప్పిపుట్టేవరకు నడిచాం. అలా నడిచాక ఒక ఒడ్డున, పాడుబడిన ఇల్లు లాంటిది వుంది. మూడు వైపులా గోడలున్నాయి, ఒకవైపు లేదు. పెద్ద పెద్ద గోతులున్నాయి. అందులో శిరిడి సాయినాథులు ఒక గోడ పక్క కింద కూర్చుని వున్నారు. నేను, "బాబా ద్వారకామాయి అంటే ఇదేనా?" అనడిగాను. బాబా నా వైపు పరీక్షగా చూసి నవ్వి తలూపుతూ, "ఆ,, వచ్చేసావుగా, ఇక రా!" అన్నారు. ఆయన దగ్గర ఒక చిన్న అమ్మాయి వుంది. పొట్టి పరికిణి, పొట్టి జాకెట్ వేసుకుని వుంది. ఆ పాప అప్పుడే చీపురుతో అక్కడ తుడిచి పక్కన పెట్టి వచ్చింది.

నాకు మెలకువ వచ్చేసింది. అప్పుడు తెల్లవారుఝాము అయ్యింది. తరవాత ఒకటే భయమేసింది. ఇదివరకు మావాళ్లెవరో, 'నీళ్లు కలలోకొస్తే మంచిది కాదు' అన్నారు. అందుకని భయం. 'నేనొక్కదాన్ని వెళ్లినా బాగుండును, అబ్బాయిని కూడా తీసుకెళ్ళాను' అని బాధపడ్డాను.

నాలుగు రోజులు పోయాక నేను ఒంగోలు వెళ్లాను. అక్కడ మా తోడికోడళ్ళు వుంటారు. వాళ్ళందరూ బాబా భక్తులు. వాళ్లకి పూజ్యశ్రీ మాస్టరుగారు తెలుసు. వారి గ్రంథాలన్నీ పారాయణ చేసుకునేవారు. నేను మా తోటికోడలితో నాకొచ్చిన కల గురించి చెప్పి, "కలలో నాతోపాటు పిల్లవాడిని కూడా తీసుకెళ్ళాను, వాడికేదో అవుతుందని నా బాధ" అని చెప్పి ఏడ్చాను. వాళ్ళు "మేము ఇన్ని సంవత్సరాలనించి బాబాని పూజిస్తున్నాము. అయినా మా కెప్పుడూ దర్శనం ఇవ్వలేదు. బాబా గురించి ఏమి తెలియక పోయినా, నీకు దర్శనం ఇచ్చారు. నువ్వు చాలా అదృష్టవంతురాలివి" అని అన్నారు.

మరో రెండు రోజులు పోయాక, ఇంకొక తోడికోడలు, 'మేమంతా శిరిడి వెడుతున్నాం, నువ్వుకూడా వస్తావా' అనడిగింది. నేను మావారిని అడిగితే, పిల్లవాడిని కూడా తీసుకుని వెళ్ళమని చెప్పారు. మేమందరం రెండు బస్సుల్లో శిరిడి వెళ్ళాం. దారిలో బస్సు పాడైపోయి చాలా ఆలస్యం అయిపోయింది. దాదాపు శేజ్ హారతి మొదలయ్యే సమయానికి చేరుకున్నాం. బస్సులు ఎక్కడో దూరంగా ఆపారు. అందరూ ఇప్పుడు హారతికి వెళ్లలేమని, అక్కడే వుండి పోయారు. నేను

మాత్రం మాతోటికోడలిని తీసుకుని, అక్కడిదాకా వెళ్లి ప్రయత్నిద్దామని చెప్పి బయలుదేరాను. నేను, మా అబ్బాయి, మా తోడికోడలు ముగ్గురం ద్వారకామాయి దగ్గరకి వెళ్లాం. ఆ రోజుల్లో అక్కడ ఒక చిన్న ద్వారం ఉండేది. ఎవరైనా ముఖ్యమైనవాళ్ళు వస్తే ఆ ద్వారం నించి లోపలకి పంపేవాళ్లు. అక్కడినించి సమాధి మందిరానికి వెళ్లిపోవచ్చు. సరిగ్గా మేము వెళ్లిన సమయానికి ఎవరో వస్తే ఆ ద్వారం తెరిచారు. వాళ్ళతోపాటు మేము కూడా లోపలికి వెళ్లిపోయాం. మమ్మల్ని ఎవరూ అడ్డుకోలేదు. అక్కడ శేజ్ హారతి జరుగుతోంది. ఇదివరకు నేనెప్పుడూ ఆ హారతి వినలేదు. నాకేమి అర్థం కాలేదు. కానీ, హారతి అవుతున్నంతసేపూ నేను బాబాతో ఏదో చెప్పుకుంటున్నాను. లోపలున్న దుఃఖమంతా ఆయనతో చెప్తున్నాను. ఆయన వింటున్నారో లేదో నాకనవసరం, నాపాటికి నేను మాట్లాడుతూనే వున్నాను. ఇంతలో మా తోడికోడలు "హారతి అయిపోయింది, అందరూ వెళ్లిపోయారు, మనం బైటికి వెళ్ళాలి రా" అంటోంది. సరేనని, బైటికి వచ్చి మా వాళ్ళని కలుసుకున్నాం. వాళ్ళందరూ మేము ముగ్గురం ఎక్కడికి వెళ్లిపోయామోనని కంగారు పడుతున్నారట. మేము జరిగినది చెప్తే, 'చాలా అదృష్టవంతులు, మేము ఇన్ని సార్లు శిరిడి వచ్చాం, సమయానికి వరుసలో నిల్చోకపోతే, లోపలకి వెళ్లలేమని చెప్పారు. అది నా మొట్టమొదటి అనుభవం.

తరవాత మేము ఒంగోలు కి రావడం, బాబా గుళ్లో సాయి లీలామృతం, గురుచరిత్ర గ్రంథాలు తెచ్చుకుని పారాయణ చేయటం, సరోజనమ్మగారి ద్వారా, సత్సంగాలకి వెళ్లడం జరిగింది. తరవాత చాలా సంవత్సరాలకి, ఒకసారి, చాలా మందితో కలిసి షిరిడీకి వెళ్ళాం. అప్పుడు తెల్లవారుఝాము హారతికి వెళ్లాం. అది కార్తీకమాసం. నేను హారతినించి బైటికి వచ్చాక దీపారాధన చేసుకున్నాను. మాతో మా అక్క కొడుకు వచ్చాడు. మా అక్క రాలేదు. ఆ అబ్బాయి విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతూ నాకు వచ్చి చెప్పాడు.

హారతి జరుగుతున్నప్పటినించి ఉందిట, నాకు చెప్పలేదు. నేను చాలా ధైర్యంగా వాళ్ళందరిని అక్కడ ఉండమని, వాడిని తీసుకుని బయలుదేరాను. చిత్రం ఏమిటంటే, నాకు ఎప్పుడూ శిరిడి బాగా తెలిసినట్లు ఉండేది. బైటికి వచ్చి, రిక్షా యెక్కి, ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళమన్నాను. అక్కడ మన భాష వచ్చిన వాళ్ళెవ్వరూ లేరు. నేను చెప్పేది వాళ్లకు అర్థం కాలేదు, నేను ఏడుస్తూ బాబాకి చెప్పుకుంటున్నాను.' బాబా వీడికి బాగుచేయండి, ఈ పిల్లాడి తల్లి కూడా రాలేదు, ఏ ప్రమాదం జరగకుండా చూడు బాబా' అని దణ్ణం పెట్టుకున్నాను.నా బాధ చూసి, ఈలోపల ఒక నర్స్ గబగబా వెళ్లి, తెలుగు వచ్చిన డాక్టర్ ఉంటే అతన్ని తీసుకు వచ్చింది. ఆయనకి విషయం చెప్పాక, ఆయన ఇంకొక డాక్టరుని తీసుకొచ్చారు. ఆయన బాబుకి ఒక ఇంజక్షన్ చేసి, 'బాబు కొంతసేపు పడుకుంటాడు, ఏమికాదులెండి' అన్నారు. వాడు వెంటనే నిద్ర పోయాడు. నేను అప్పుడు నాచుట్టూ అంతా గమనిస్తున్నాను. అలా చూస్తున్న నాకు, గోడమీద ఒక చిత్రపటం కనిపించింది. అది చూసి ఆశ్చర్యపడిపోయాను. అదేమిటంటే, ఇదివరకు ఒకసారి కలలో, పాడుబడిన ఇల్లు, ఆ ఇంట్లో బాబాతో పాటు ఒక పిల్లని చూపించారని చెప్పాను కదా, ఆ పిల్లతో కలసిన బాబా ఫోటో గోడమీద కనిపించింది. అదే అమ్మాయి ఫోటో ఇక్కడ వుందేమిటని ఆశ్చర్యమేసింది. ఈలోపల ఇంకొక పెద్ద డాక్టర్ వచ్చారు. ఆయన బాబా ప్రసాదం, అంటే, తీపి గుళికలు లాంటివి ఇచ్చారు. వాడు అవి తిన్నాక, రెండుసార్లు లఘుశంకకు వెళ్ళివచ్చాడు. వాడికి ఆ నొప్పి తగ్గిపోయింది. తరవాత ఇక ప్రమాదం లేదని డాక్టరుగారు మమ్మల్ని పంపించేశారు. ఈ లోపల మా వాళ్ళందరూ ఆసుపత్రికి వచ్చేసారు. వాళ్ళందరూ, 'నీకు ఇక్కడ ఆసుపత్రి ఉందని ఎలా తెలుసు, ఒక్కదానివే ఎలా వచ్చేసావ్' అని ఎంతో ఆశ్చర్యంతో అడిగారు. అంత ధైర్యం ఎలా వచ్చిందో నాకు మాత్రం తెలిస్తేకదా అనుకుని, బాబుని తీసుకుని మా బసకి వచ్చేసాం.

రెండు సార్లు, నేను చిన్న పిల్లలతో వున్నప్పుడే ఆ పాపని బాబా ఎందుకు చూపించారో, ఇప్పటికి నాకర్థం కాలేదు. కానీ ఒక్క విషయం మాత్రం అర్థమయ్యింది. బాబా చరిత్రలో చెప్పినట్లు, 'నా వాడు యెంత దూరాన వున్నా, పిచ్చుక కాలికి దారంవేసి లాగినట్లు, నా చెంతకు రప్పించుకుంటాను' అన్న బాబా వాక్యం యథాతథంగా నా విషయంలో జరిగింది. ఆవిధంగా బాబా నన్ను రప్పించి గురుదంపతులకు అప్పగించారనిపిస్తుంది. ఎవరెవరిని ఏ రకంగా ఎక్కడకి చేర్చాలో ఆయన కంటే తెలిసిన వారెవ్వరు? అందుకే వారు సమర్థ సద్గురువు!!

•

# ఆచార్యుని అద్భుత లీలలు

**_శ్రీ సాయికుమార్, నెల్లూరు_**

నెల్లూరు వాస్తవ్యులైన శ్రీ సాయికుమార్ గారు పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ గారితో తన స్మృతులను ఈ విధంగా తెలియజేస్తు న్నారు.

మేము వెంకటేశ్వర స్వామి, జొన్నవాడ కామాక్షి అమ్మవారిని కొలుచుకునేవాళ్ళము. ఒకరోజు మా నాన్నగారు శిరిడి సాయిబాబా పటాన్ని ఇంటికి తీసుకొచ్చారు. అప్పటిదాకా బాబాతో పరిచయం లేకపోయినా, వారిపటాన్ని కూడా పూజలో పెట్టుకున్నాం. మరో 3 రోజులకి, సాయిబాబా పక్షపత్రిక మా ఇంటికి వచ్చింది. మా పోస్టుమాన్ ఎవరికో యివ్వవలసిన పత్రికలు మాకు యిచ్చేసాడు. అవి చదివిన వెంటనే, మేము పత్రికకి జీవిత సభ్యత్వం కట్టేసాము. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయి లీలామృతం గ్రంథాలు పంపించారు. మేమందరం పారాయణ చేసేవాళ్ళం. మా అందరికన్నా మా అమ్మ చాలా బాగా పారాయణలు చేసేవారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు, 1986-87 ప్రాంతంలో ఒకసారి నెల్లూరుకి వచ్చారు. మా ఇంట్లో అందరూ దర్శనానికి వెళ్లారు. నేను మర్నాడు మధ్యాహ్నం 2-30 ప్రాంతంలో ఒక్కడినే పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి వెళ్లాను. బైట వరండాలో ఇద్దరు అబ్బాయిలు చిన్నగా మాట్లాడుకుంటున్నారు. లోపలి గదిలో పూజ్యశ్రీ మాస్టరుగారు ఒకచాప మీద పడుకుని వున్నారు. వరండా నించి స్పష్టంగా కనిపిస్తున్నారు. నేను వాళ్ళని పూజ్యశ్రీ మాస్టరుగారు ఎప్పుడు లేస్తారని అడిగాను. ఒక గంట పడుతుందని చెప్పారు. నేను కొద్దిసేపు కూర్చుని వెళ్ళిపోయాను. నేను మరికొంతసేపు వుండి ఉంటే, వారితో మాట్లాడే అవకాశం వుండేది కదా అని తరవాత చాలా బాధ పడ్డాను. ఆ వయసులో(అప్పుడు నేను ఇంటర్మీడియట్ చదువుతున్నాను) ఆ క్రొత్త పరిచయంలో (ఆగదిలో వారిని చూడగానే) 'వారు చాలా ఉన్నతమైనవారు' అన్న భావం వచ్చింది.

ఇంకొకసారి, పూజ్యశ్రీ మాస్టరుగారు నెల్లూరు దత్తసాయి మందిరం వార్షికోత్సవానికి వచ్చారు. కాసేపట్లో సత్సంగం మొదలవుతుందనగా పూజ్యశ్రీ మాస్టరుగారు అక్కడ ఒక కుర్చీలో కూర్చుని వున్నారు. సత్సంగ సభ్యులందరు గుడిలో వున్నారు. నేను మాత్రం గుళ్ళోకెళ్ళకుండా నేరుగా పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకి వెళ్లాను. పాదనమస్కారం చేసుకున్నాను. ఊదీ పెట్టారు. నేను ఏమీ మాట్లాడలేదు. ఈలోపు మా అమ్మగారు వచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు "బాగున్నావామ్మా" అని పలకరించారు. మా అమ్మ నన్ను నమస్కారం చేసుకొమ్మన్నారు. నేను మళ్ళీ నమస్కారం చేసుకున్నాను. నాకు మళ్ళీ ఊదీ పెట్టి నా కళ్ళల్లోకి తీక్షణంగా చూసారు. అప్పుడు కూడా నేను ఏదో మాట్లాడాలనుకున్నాను, కానీ ఆ మాటలు బైటికి రాలేదు. అయితే నేను మాట్లాడకపోయినా నా గురించి వారికంతా తెలుసునని కాలాంతరంలో నాకు అర్థమయ్యింది.

మర్నాడు మా కజిన్, నేను దత్తసాయి మందిరంలో మాస్టరుగారి సత్సంగానికి వెళ్ళాము. అక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారు "మన బ్రహ్మాస్త్రం సాయి లీలామృత పారాయణం. మన కోరిక నెరవేరిన తరువాత,

ఎవరికైనా మరొక గ్రంథం ఉచితంగా యివ్వడం చెయ్యాలి" అని యింకా ఏవేవో చెప్తున్నారు. నాకు మనసులో 'అవి వీరి సొంత గ్రంథాలు కదా, అందుకే అలా చెప్తున్నారేమో' అని అనిపించింది. ఇలా అనిపించిందో లేదో, వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు "ఈ గ్రంథాలు నా సొంతం కనుక, ఇవి పారాయణ చేయించడం ద్వారా నేను సొమ్ము చేసుకోవచ్చని, కొందరు అనుకుని వుండొచ్చు. నేనే కనక ఇలా కాకుండా, వేరేగా పుస్తకాలు రాసి అమ్మితే, రామాయణ భారతాలు చదివే వాళ్ళు కూడా వాటిని పక్కన పెట్టి నేను రాసిన పుస్తకాలు చదువుతారు. చేతకాక కాదు, మార్గం అది కాదని. నా మీద వున్న దుమారాల్లో యిది ఒకటి" అంటూ చెప్తున్నారు. నా గుండె గుభేల్ మంది. నేను యిప్పుడే యిలా మనసులో అనుకున్నానోలేదో, దానికి తగ్గ సమాధానం చెప్పేసారు. 'నా మీదవున్న దుమారాల్లో యిదొకటి' అంటే 'నాలాంటివాళ్లు యింకా చాలా మందే వున్నారన్న మాట' అనుకున్నాను. ఎవరు మనసులో ఏమనుకున్నా అన్నీ ఆయనకి తెలుస్తాయని ఆరోజు నాకు స్పష్టంగా అర్థమయింది!!

అప్పుడు ఒక రోజు శ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారిని కూడా ఆహ్వానించారు. పూజ్యశ్రీ మాస్టరుగారి సత్సంగం మొదలైన కొంతసేపటికి శ్రీ రాఘవనారాయణ శాస్త్రిగారు వచ్చారు. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు సత్సంగం ఆపి, వారికి మాట్లాడటానికి మైక్ ఇచ్చారు. వారు బాగా వృద్ధులు అవ్వడంవల్ల, వారు మాట్లాడేది ఎవ్వరికీ అర్థం కావడంలేదు. అందరూ అన్యమనస్కంగా వున్నారు. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారు మాత్రం, ఆయనవైపు చాలా శ్రద్ధగా చూస్తూ, ఆయన ఉపన్యాసం వింటున్నారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది, పూజ్యశ్రీ మాస్టరుగారి వినయ విధేయతలకి!

పూజ్యశ్రీ మాస్టరుగారు తిరిగి బయలుదేరే ముందు వారిని దర్శనం చేసుకుందామని గబగబా మందిరానికి బయలుదేరాను. ఈసారి పూజ్యశ్రీ మాస్టరుగారిని నాకు ఇంజనీరింగ్ లో సీట్ రావాలని కోరుకుందామని అనుకున్నాను. అక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక గదిలో కూర్చుని వున్నారు. నేను వెళ్లి పాదనమస్కారం చేసుకున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారి వైపు చూస్తున్నాను. ఆయన నావైపు చూస్తే, నా మనసులో కోరిక అడుగుదామని నా ఆలోచన. కానీ మాస్టరుగారు ఏమాత్రం నన్ను పట్టించుకోకుండా, 'కుమారి' అని ఎవరినో పిలిచి, ఆమెకి ఏదోచెప్పి, నా చేతిలో ఆపిల్ పండు ముక్క ప్రసాదం పెట్టారు. నేనేమి మాట్లాడకుండా ప్రసాదం తీసుకుని బైటికి వచ్చేసాను.

కానీ వారు సర్వాంతర్యాములు కనుక, నేనెందుకు వచ్చానో, నాకేం కావాలో వారికి తెలుసు కనుక నాకేది మంచిదో వారే చూసుకునేవారు. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే, నా ఉద్యోగం, వివాహం, అన్నీ నాకు అనుకూలంగానే జరిగాయి. నేను పూజ్యశ్రీ మాస్టరుగారితో అందరిలాగా సంభాషించలేదే అని నాకు మనస్సులో కొంత కొరత ఉండేది. చాలా రోజుల తరవాత ఒకసారి స్వప్నంలో, పూజ్యశ్రీ మాస్టరుగారు మాఇంటికి వచ్చి హాలులో కూర్చుని కొంతసేపు, పక్క గది గుమ్మానికి చెయ్యి ఆనించి కొంతసేపు, అలా ఇల్లంతా తిరుగుతూ నాతో ఏదో సంభాషించారు. వారితో మాట్లాడాలనే నా కోరికను అలా తీర్చారు అనుకున్నాను.

పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల, మహాత్ముల దర్శనం కూడా చేసుకున్నాను. రామిరెడ్డితాత, గులాబ్ బాబా, జిల్లెళ్ళమూడి అమ్మ, వెంకయ్య స్వామి, కంచి స్వామి మొదలైన మహాత్ములను దర్శించుకున్నాను. ఇప్పుడు కూడా పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరానికి వెళ్లి నమస్కారం చేసుకోగానే, వెంటనే ఏదో ఒక మహాత్ముని సమాధి మందిరానికి వెళ్లడం జరుగుతుంది. 1985 నించి ప్రారంభమైన పూజ్యశ్రీ మాస్టరుగారితో పరిచయం, వారు సమాధి చెందాక కూడా కొనసాగుతోంది. మాలో మానసికమైన మార్పుని తీసుకువచ్చి, మా జీవితాలని చక్కదిద్ది ఈనాటికీ మాకు తోడుగావుండి మమ్మలిని నడిపిస్తున్న, వారి ప్రేమకు, శిరస్సువంచి పాదాభివందనములు సమర్పించుకుంటున్నాను.

జై సాయి మాస్టర్ !!

పరమ పూజ్య అచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o.SRI MANGA BHARADWAJA TRUST**

**Regd.Office:** Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68.

Phone: +91 - 74160 41550

**Branch Office** : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh.

Phone:08592 233271

Send DD in favour of **"Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad or Ongole.**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర (Bound) | 450-00 |
| శ్రీ సాయి లీలామృతం | 150-00 |
| శ్రీ గురు చరిత్ర | 150-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రభోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము - భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 25-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 125-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి - ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాలస్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము - మన సంస్కృతి | 70-00 |

ఇతర ప్రచురణలు


| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-1 | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-2 | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |
| బాలల శ్రీ గురు చరిత్ర | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము | 15-00 |
| మాష్టారు అమృత వాక్కులు | 100-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master (Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's Sai Baba the Master | 60-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 150-00 |
| Sai Leelamrutham (Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 50-00 |
| Sri Guru Charitra (Kannada) | 99-00 |
| Shiridi Aarathi (Tamil) | 15-00 |
| Stavana Manjari (Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra (Kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |
| Sai Sannidhi (Kannada) | 120-00 |
| Sri Guru Charitra (Malayalam) | 150-00 |
| Sri Guru Charitra (Oriya) | 150-00 |


01ST OCTOBER, 2022

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.




పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి జన్మదినోత్సవ వేడుకలు హిందూ కాలమాన ప్రకారం భాద్రపద బహుళ దశమి (20–09–2022) రోజున, ఆంగ్ల కాలమాన ప్రకారము 1, 2 అక్టోబరు 2022 తేదీలలోనూ మరియు శ్రీ శిరిడి సాయినాథుని మహాసమాధి పుణ్యదినమైన విజయదశమి వేడుకలు అక్టోబర్ 5వ తేదీన 'మాతృదేవి దివ్య సన్నిధి' లో వైభవంగా జరిగాయి.